మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :88 | బుధవారం , 26 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# ఢిల్లీకి 36వ సారి


2 లో

సీఎం రేవంత్ రెడ్డి.. మళ్లీ గాలిమోటర్ ఎక్కి పోయి రావలే హస్తినకు అంటున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకు ముఖ్యమంత్రి అయి 15 నెలలు కావస్తోంది. ఈ 15 నెలల్లో ఆయన ఫ్లైట్ మోడ్‌లోనే ఎక్కువ కాలం గడపాల్సి వచ్చింది. ఎక్కే విమానం.. దిగే విమానం అన్నట్టుగానే ఆయన పరిపాలన సాగుతోంది. మంగళవారం సాయంత్రం ఆయన మరోసారి హస్తినకు పయనమవుతున్నారు. పార్టీ అధిష్టానం పెద్దలను కలిసి చర్చించేందుకే ఆయన ఢిల్లీకి వెళ్తున్నారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆ ఎన్నికలపై చర్చించేందుకే రేవంత్ హస్తిన బాట అంటున్నారు. 2023 డిసెంబర్ 7న రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా, మరో 11 మంది కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ కేబినెట్‌లో మొత్తం బెర్త్ లు 18 కాగా ఇంకో ఆరుగురిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశమున్నది. 15 నెలలుగా కేబినెట్ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు. ఈ 15 నెలల్లో ఎప్పుడో ఒకసారి తప్ప కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ముఖ్యమంత్రి టేకాఫ్.. ల్యాండింగ్‌లతో బిజీ బిజీగా ఉంటున్నారు.

# హైదరాబాద్‌లో తాగునీటి కష్టాలు



2 లో

వేసవి రాకముందే తెలంగాణలో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు పడిపోవడంతో ప్రజలు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం దృష్టి సారించకపోగా.. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు హరీశ్ రావు స్పందిస్తూ ప్రభుత్వంపై విరుకుపడ్డారు.

## 36వ సారి వెళ్లి ఇప్పుడు పీకేదేంటి..?

### - కేటీఆర్ .



అధికార కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టి.. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో హస్తం నేతలు, కార్యకర్తలు చేరుతున్నారంటే రేవంత్ ప్రభుత్వం పతనానికి సంకేతం అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికీ 35 సార్లు ఢిల్లీ వెళ్లి చేసిందేమిటీ..? తాజాగా ఇవాళ 36వ సారి ఢిల్లీకి వెళ్లిండు.. ఇప్పుడు పీకేదేంటి..? అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

2 లో

## ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై

### జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి - కేటీఆర్


2 లో

ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై జ్యుడిషీయల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకవైపు సహాయక చర్యలను మరింత వేగవంతంగా కొనసాగిస్తూనే జరిగిన ప్రమాదంపైన అందుకు బాధ్యులైన వారిపైన విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆ విషయం నిరూపించాలి.. రేవంత్‌కు

### కిషన్‌రెడ్డి మాస్ సవాల్


2 లో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేయడం వల్లనే తాను గట్టిగా రిప్లై ఇవ్వాల్సి వస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదని స్పష్టం చేశారు. దేశం మీద భక్తితో జెండా మీద గౌరవంతో బీజేపీలో మాములు కార్యకర్తగా వచ్చి ఈ స్థాయికి వచ్చానని అన్నారు.

## ఎమ్మెల్యేల అనర్హత కేసు మరోసారి వాయిదా

### మార్చి 4వ తీర్పు వచ్చే అవకాశం


2 లో

తెలంగాణలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుపై ఇవాళ స్పష్టత వస్తుందని అంతా ఎదురుచూసిన నేపథ్యంలో మరోసారి వాయిదా పడింది. మార్చ్ 4వ తేదీన ఈ కేసుపై స్పష్టత రావచ్చుని తెలుస్తోంది.

## గుడ్ న్యూస్ చెప్పిన రేవంత్ రెడ్డి సర్కార్.. మార్చి ఒకటి నుంచే..


2 లో

తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రకటించింది. మార్చి ఒకటిన ఒకే రోజు లక్ష కార్డులు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

## అమ్మతోడు.. తెలుగు భాషలో

### ఇన్ని తిట్లు ఉంటాయని నాకు తెలియదు : కేటీఆర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మహిళలు దూషిస్తున్న వైనంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. అమ్మతోడు.. తెలుగు భాషలో ఇన్ని తిట్లు ఉంటాయని కూడా నాకు తెలియదు అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.


2 లో

## నేటిమాట

“సక్సెస్ సాధించాలంటే కష్టపడాలి, కష్టం లేకుండా విజయాన్ని ఆశించకండి.”



-డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం

## నోరు తెరిస్తే హిందూ, ముస్లిం

# చిల్లర మాటలు మానేయండి

### మంత్రి సీతక్క


2 లో

## కాంగ్రెస్ ఓడిపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా

### మెదక్ ఎంపీ రఘునందన్ రావు


2 లో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే రాజీనామాకు రేవంత్ రెడ్డి సిద్ధమా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాస్ సవాల్ విసిరారు. పనిచేశా.. ఓటు వేయమంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను తన పాలనకు రెఫరెండంగా తీసుకుంటారా అని ప్రశ్నించారు. . ఎమ్మెల్సీ ఎన్నికలతో తమ ప్రభుత్వానికి వచ్చేది లేదు.. పోయేది లేదు అంటున్న కాంగ్రెస్ నేతలు ఎందుకు పోటీ చేస్తున్నారని నిలదీశారు.

# ఢిల్లీకి 36వ సారి

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మొదట్లో రాహుల్ గాంధీతో టర్మ్స్ బాగానే ఉండేవని.. తాను వద్దని వారించినా వినకుండా హైడ్రా పేరుతో సాగించిన విధ్వంసంతోనే తెలంగాణ ముఖ్యమంత్రికి రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని చెప్తున్నారు. కొన్ని రోజుల క్రితం సోనియాగాంధీ నివాసంలో రేవంత్ ను రాహుల్ గాంధీని కలిసి అక్కడా వన్ సైడ్ బ్యాటింగ్ మాత్రమే జరిగిందని చెప్తున్నారు. నెలల విరామం తర్వాత పార్టీ అగ్రనేత అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో ఏదేదో చెప్పేద్దామని ఆత్రుత పడ్డ రేవంత్ రెడ్డికి వన్ సైడ్ బ్యాటింగ్‌తో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొన్నట్టుగా గాంధీ భవన్ వర్గాలే చెప్తున్నాయి. రాహుల్‌తో మీటింగ్ కు సంబంధించిన ఒక్కటంటే ఒక్కఫొటో కూడా రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా, రేవంత్ సొంత టీమ్ బయట పెట్టలేదు. అంటే రాహుల్ గాంధీ కనీసం ఫొటో దిగేందుకు కూడా అవకాశం ఇవ్వలేదా? అదే నిజమైతే రేవంత్ రెడ్డికి పార్టీ పెద్దల దగ్గర ఉన్న విలువ ఏపాటిదో తేలిపోతుంది. రేవంత్ చర్యలతో కాంగ్రెస్ పార్టీ ఇమేజీ దెబ్బ తింటుందని.. ఇప్పటికిప్పుడు రాజకీయంగా కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం లేకపోవడంతోనే ముఖ్యమంత్రి పీఠంపై రేవంత్ కొనసాగుతున్నారని సీనియర్ కాంగ్రెస్ నేతలు ఆఫ్ ది రికార్డుగా చెప్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వంతో పాటు రాష్ట్ర పార్టీ నాయకత్వంపై కాంగ్రెస్ హైకమాండ్ ఓ కన్నేసి ఉంచిందని సమాచారం. కర్నాటక తర్వాత ఆర్థికంగా పార్టీకి చేయూతనిచ్చే రాష్ట్రం కూడా తెలంగాణానే. ఈ నేపథ్యంలోనే తెలంగాణ విషయంలో పార్టీ హైకమాండ్ ఆచితూచి వ్యవహరిస్తుందని చెప్తున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి ఆయన టీమ్ కేబినెట్ విస్తరణతో పాటు పీసీసీ కమిటీలపై హైకమాండ్ అనుమతి ఇస్తుందని మీడియాకు లీకులు ఇవ్వడం.. ప్రతిసారి రేవంత్ వట్టి చేతులతో తిరిగి రావడం పరిపాటిగా మారింది. ఆర్థికంగా వెసులుబాటు ఉన్న తెలంగాణలోనే ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేయలేని పరిస్థితి. పరిపాలనపై రేవంత్ కు పట్టు లేకపోవడం.. హైడ్రా పేరుతో ప్రజల ఇండ్లను కూల్చేయడం.. మూసీ ప్రాజెక్టు పేరుతో భారీ అవినీతి చేయబోతున్నట్టుగా స్వయంగా రేవంత్ రెడ్డినే ఇండికేషన్స్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ అంటేనే ఇంత అనే భావన ప్రజల్లో పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో కరెంట్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. రైతు భరోసా వానాకాలం సీజన్ కు పూర్తిగా ఎగవేయడం.. పంటలు సాగుచేసిన రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వకపోవడంతో ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నోటికి వచ్చినట్టు తిడుతున్నారు. ఈ విషయాలన్నీ రాహుల్ గాంధీ ఇంటర్నల్ టీమ్ పూసగుచ్చినట్టు ఢిల్లీ పెద్దలకు ఎప్పటికప్పుడు చేరవేస్తోంది.

రాహుల్ దూతగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ ఇప్పటికే యాక్షన్‌లోకి దిగిపోయారు. ఈక్రమంలోనే రేవంత్ ను ఢిల్లీకి రావాలని పార్టీ హైకమాండ్ కబురు పంపింది. 15 నెలల కాంగ్రెస్ పాలన డిజాస్టర్స్ పై రేవంత్ ను పార్టీ హైకమాండ్ నిలదీసే అవకాశమున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అలాగే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఎవరికి అవకాశం ఇవ్వాలనే విషయంపై దిశానిర్దేశం చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. నామినేషన్ల దాఖలుకు రెండు వారాల సమయంలో ఉండటంతో అభ్యర్థుల ఎంపికపై మరికొన్ని రోజుల తర్వాతే క్లారిటీ రావొచ్చని చెప్తున్నారు. రేవంత్ తీరుతోనే ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు కాంగ్రెస్ పార్టీ మెడ మీదకు వచ్చిందని.. ఒకవేళ సుప్రీం కోర్టు జోక్యంతో ఉప ఎన్నికలు వస్తే దానికి రేవంత్ రెడ్డినే బాధ్యత వహించాలని కూడా హైకమాండ్ తేల్చిచెప్పే అవకాశముందని సమాచారం. అస్తవ్యస్తంగా మారిన కులగణన, ఎస్సీ వర్గీకరణను సరిచేయాలని పార్టీ హైకమాండ్ ఆదేశించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. రేవంత్ రెడ్డి విషయంలో ఇకపై పార్టీ హైకమాండ్ కఠినంగానే ఉంటుందని.. పార్టీకి నష్టం చేసే చర్యలను ఉపేక్షించదని కూడా సమాచారం. ఇన్నాళ్లు ఒకలెక్క.. ఇకనుంచి ఒకలెక్క అన్నట్టుగా రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు.. హైకమాండ్ పెద్దలతో సమావేశాలు ఉండబోతున్నాయని గాంధీ భవన్ వర్గాలు చెప్తున్నాయి. అంటే రానున్న రోజుల్లో రేవంత్ ఏ చిన్న పని చేయాలన్నా గాలిమోటర్ ఎక్కి హస్తిన పోయి రావాల్సిందేనని స్పష్టం చేస్తున్నాయి.

# 36వ సారి వెళ్లి ఇప్పుడు పీకేదేంటి..?

**- కేటీఆర్**

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 15 నెలల కాలంలోనే అధికార పార్టీని వదిలిపెట్టి బీఆర్ఎస్‌లో చేరుతున్నారంటే.. ఆ పార్టీ పాలన ఏంటో అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజలకు విసుగు వచ్చిందన్నారు. రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లోనూ పట్నం నరేందర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ నేతలు టీఆర్ఎస్‌లో చేరారు. 15 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజలకు కోపం వస్తుందని కేటీఆర్ తెలిపారు.

గత 48 గంటల్లో రాష్ట్రంలో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇంకో దిక్కు ఎస్ఎల్బీసీ వద్ద ప్రమాదం జరిగి 8 మంది కార్మికులు సొరంగంలో ఇరుక్కుపోయారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నాడు. ఆ ఎన్నికతో గవర్నమెంట్ మారేది లేదు.. ప్రభుత్వం తలకిందులు అయ్యేది లేదు. కానీ దాని కోసం హెలికాప్టర్‌లో పోయి మాట్లాడుతున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు.

రైతు ఆత్మహత్యలు, కార్మికులు ఇరుక్కుపోతే సోయి లేకుండా గాల్లో చక్కర్లు కొడతున్నాడు సీఎం రేవంత్ రెడ్డి. తాజాగా 36వ సారి ఢిల్లీకి పోయిండు. ఏం పీకారు ఢిల్లీకి వెళ్లి. కనీసం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేకపోతున్నాడు. రాష్ట్రానికి హోం మంత్రి, విద్యాశాఖ మంత్రి, సంక్షేమ శాఖ మంత్రి లేదు. మంత్రులను నియమించుకోలేని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను, ఆయన ఆనవాళ్లను మాయం చేస్తా అంటుండు. తెల్లారిలేస్తే కేసీఆర్ జపం చేయని రోజు ఉండదు. నిద్రలో కూడా కేసీఆరే యాదికి వస్తున్నట్లుంది. వాస్తవం ఏందంటే.. రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు దగ్గరి దోస్తులకు ఇలా చెప్పుకున్నడంట.. మనం గెలుస్తలేం.. ప్రతిపక్షంలో ఉండి గట్టిగా కొట్లాడాలి.. కేసీఆర్ ఉన్నన్ని రోజుల గెలువం అని చెప్పుకున్నడట. కానీ ప్రజలు లక్కీలాటరీలో ఆయనను గెలిపించారని కేటీఆర్ తెలిపారు.

# గుడ్ న్యూస్ చెప్పిన రేవంత్ రెడ్డి సర్కార్.. మార్చి ఒకటి నుంచే..

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో లక్ష కార్డులను అధికారులు పంపిణీ చేయనున్నారు. కొత్త జిల్లాల ప్రకారం.. హైదరాబాద్- 285, వికారాబాద్ జిల్లా- 22 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లా- 15 వేలు, నారాయణపేట జిల్లా- 12 వేలు, వనపర్తి జిల్లా- 6 వేలు, మహబూబ్‌నగర్ జిల్లా- 13 వేలు, గద్వాల్ జిల్లా- 13 వేలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా- 6 వేలు, రంగారెడ్డి జిల్లా- 24 వేలు చొప్పున లక్ష కార్డులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మార్చి 8 తర్వాత అన్ని జిల్లాల్లో పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి

కాగా, 2014 నుంచి తెలంగాణలో నూతన రేషన్ కార్డులు జారీ చేయలేదు. ఈ పదేళ్లలో లక్షల మంది వివాహాలు చేసుకుని వేరుకాపురాలు పెట్టారు. ప్రభుత్వ పథకాలు ఏమైనా అందాలంటే రేషన్ కార్డులు కీలకం. కార్డులు లేక అనేక మంది సంక్షేమ పథకాలను కోల్పోయిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు నూతన కార్డులు జారీ చేస్తున్నట్లు తీపి కబురు చెప్పింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది జనవరి 26న కూడా 16,900 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేశారు. మరోసారి ఈ ప్రక్రియ చేపట్టి మరికొన్ని కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రజాపాలన, గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. తాజాగా మీ సేవా కేంద్రాల ద్వారా కూడా అప్లికేషన్లు తీసుకుంటున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం అర్హులకు నూతన కార్డులను మంజూరు చేయనున్నారు.

## ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి - కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజా ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం వల్ల ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం జరిగింది. ఇంతకు ముందు సుంకిశాల, పెద్దవాగు ప్రమాదాలు జరిగినప్పుడు కూడా ప్రభుత్వం ఎలాంటి దర్యాప్తు చేయలేదు, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ప్రమాదాలపై హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయ కమీషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి. గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీ నేతలు, ముఖ్యమంత్రి సహా, అనేక అంశాలపై న్యాయ కమీషన్‌ల ఏర్పాటు కోసం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అనేక న్యాయ కమీషన్‌లు ఏర్పాటు చేశారని కేటీఆర్ గుర్తు చేశారు.

తాజా ప్రమాదాలపై న్యాయ కమీషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని మేము మా పార్టీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఆర్మీ, ఇతర సంస్థల సహాయంతోఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెంటనే వెనక్కి తీసుకువచ్చేలా ప్రభుత్వం మరింతగా కృషి చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో తాగునీటి కష్టాలు

మొదటి పేజీ తరువాయి


హైదరాబాద్‌లో తాగునీటి సమస్యపై 'ఎక్స్' వేదికగా స్పందించిన హరీశ్ రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'హైదరాబాద్‌లో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. వేసవి రాకముందే బోర్లు ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి. ప్రజలు భారీ మొత్తంలో డబ్బు వెచ్చించి వాటర్ ట్యాంకర్లను తెప్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది' అని మాజీమంత్రి హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. నాటి సీఎం కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లో ఇలాంటి తాగునీటి సంక్షోభం లేదని గుర్తుచేశారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదికే పరిస్థితి విషమించింది. తెలంగాణలో భూగర్భజలాలు 2.88 బిలియన్ క్యూబిక్ మీటర్లు అడుగంటిపోయాయని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. దేశంలోనే భూగర్భ జలాలు భారీగా క్షీణించిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది' అని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. హైదరాబాద్‌లో 15 శాతం అదనంగా వర్షపాతం నమోదైనా భూగర్భజలాలు 1.33 మీటర్లు తగ్గాయి. కూకట్‌పల్లిలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. అక్కడ భూగర్భ జలమట్టం ఏకంగా 25.90 మీటర్ల లోతుకు పడిపోయింది' అని హరీశ్ రావు వెల్లడించారు.

'ఇప్పటికే నిత్యావసరాల ధరలతో విలవిలలాడుతున్న సామాన్యులు నీటి ట్యాంకర్ల కోసం రూ.వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. గొంతు తడుపుకోడానికి కనీసం తాగునీళ్లు కూడా ఇవ్వలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమది ప్రజాపాలన అని ఊదరగొట్టుకోవడం సిగ్గుచేటు' అని రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు విరుచుకుపడ్డారు. ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు.

'బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందింది. మిషన్ కాకతీయతో చెరువులను పునరుద్ధరించడంతో ఎండాకాలంలో చెరువులు మత్తడులు దుంకాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చెరువులు ఎండిపోతుంటే.. భూగర్భజలాలు పడిపోతున్నాయి' అని మాజీ మంత్రి హరీశ్ రావు వివరించారు. ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం తన ప్రచారంలోనే మునిగిపోయిందని మండిపడ్డారు. పాలనపై శ్రద్ధ పెట్టకుండా రాజకీయ కక్షసాధింపు చర్యలతో బిజీగా ఉందని విమర్శించారు.

## చిన్నా రెడ్డి వ్యాఖ్యలపై ఈడీ, సీబీఐ, ఐటీ, ఈసీ ఎందుకు నోరు మెదపడం లేదు..? : హరీశ్‌రావు



కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలపై ఈడీ, సీబీఐ, ఐటీ, ఎన్నికల కమిషన్ ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు.

మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి చేత రూ.90 కోట్లు ఖర్చు పెట్టించారని, ఓట్లు కొనుగోలు చేసే క్రమంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు రూ. 5 నుంచి రూ. 10 లక్షల వరకు ఇస్తామని హామీ ఇచ్చి, రెండున్నర లక్షలు మాత్రమే ఇచ్చారని చిన్నారెడ్డి బట్టబయలు చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ ఏ విధంగా సమర్థిస్తారు..?

ఈడీలు, సీబీఐలు, ఐటీలు, ఎన్నికల్ కమిషన్లు ఎందుకు ఈ విషయంపై నోరు మెదపడం లేదు..? సుమోటోగా తీసుకొని కేసులు ఎందుకు పెట్టడం లేదు..? బీఆర్ఎస్ నాయకులపై నిరాధారమైన కేసులు పెట్టడంలో చూపించే అత్యుత్సాహం.. ఆధారాలున్నా, స్వయంగా క్యాబినెట్ ర్యాంకులో ఉండి, ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ నాయకుడే చెబుతున్నా ఎందుకు కేసులు పెట్టడం లేదు? కాంగ్రెస్ మార్కు ప్రజా పాలన, రాజ్యాంగ పరిరక్షణ అంటే ఇదేనా? రాజ్యాంగం చేతిలో పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ ఏ విధంగా సమర్థిస్తారు? ఏం సమాధానం చెబుతారు? బడే భాయ్, ఛోటే భాయ్ బంధానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి? బిజేపీ, కాంగ్రెస్ పార్టీల చీకటి ఒప్పందానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? వెంటనే కేసులు పెట్టి, విచారణ జరపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం.. పోలీసు రాజ్యమైంది..

ఇందిరమ్మ రాజ్యం.. పోలీసు రాజ్యమైందని, మా కార్యకర్తల నుంచి నాయకుల దాకా అక్రమ కేసులు, వేధింపులు సర్వసాధారణమైపోయాయన్న మా ఆరోపణలు వాస్తవమని కాంగ్రెస్ నాయకుడైన చిన్నారెడ్డి వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు.

చిన్నారెడ్డి బహిరంగంగా ప్రభుత్వ తీరును ఎండగట్టారు..

"పోలీసులు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇంటి కావలి కారుల్లాగా పని చేస్తున్నారు. ఎమ్మెల్యే కేసు పెట్టుమంటే పెట్టాలె, తీసేయమంటే తీసేయాలె అనే స్థాయికి దిగజారారు. గతంలో ఎన్నడూ ఒక ఎమ్మెల్యేకు అధికారులు ఇంతగా భయపడిన దాఖలాలు లేవు. నా 46ఏండ్ల రాజకీయ జీవితంలో ఇంత దారుణంగా పోలీసులు, అధికారులు ఎన్నడూ ప్రవర్తించలేదు" అని చిన్నారెడ్డి బహిరంగంగా ప్రభుత్వ తీరును ఎండగట్టారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

కొందరు పోలీసులు అత్యుత్సాహం నిజమేనని : కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ముందు నుంచి చెబుతున్నది నిజమేనని నాడు జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, నేడు వనపర్తిలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు తేటతెల్లం చేస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు.

# నోరు తెరిస్తే హిందూ, ముస్లిం.. చిల్లర మాటలు మానేయండి:

**మంత్రి సీతక్క**

కేంద్ర మంత్రి బండి సంజయ్ చిల్లర మాటలు మానుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. 11 ఏండ్లుగా కేంద్ర ప్రభుత్వం యువతకు ,నిరుద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని అన్నారు. ఏడాదికి రెండకోట్ల ఉద్యోగాలని చెప్పి .. 200 కూడా ఇవ్వలేదన్నారు. బండి సంజయ్ చేసిన అభివృద్ధేమీ లేదని, చెప్పుకొనేందుకు సబ్జెక్టు లేదని అందుకే ఓట్ల కోసం ఇండియా, పాకిస్తాన్ అంటూ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని అన్నారు.

నోరు తెరిస్తే హిందూస్తాన్, పాకిస్తాన్, హిందూ, ముస్లిం తప్ప మరో మాట తెలియదని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లడిగే నైతిక హక్కు బీజేపీ కి లేదని అన్నారు. ఉన్నత విద్య మీద 18% జిఎస్టి విధిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నది ఎవరని ప్రశ్నించారు. దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలని సవాలు విసిరారు. విద్వేషాలు పూరిత ప్రసంగాలు భారతీయుల ఐక్యతను దెబ్బతీస్తాయని అన్నారు.

## ఎమ్మెల్యేల అనర్హత కేసు మరోసారి వాయిదా మార్చి 4వ తీర్పు వచ్చే అవకాశం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పది మంది ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ పది మందిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ కోరినా స్పీకర్ పట్టించుకోలేదు. దాంతో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది బీఆర్ఎస్ పార్టీ. పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కూడా అమలు చేయడం లేదంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటీషన్ వేశారు. మరోవైపు ఇదే అంశంపై కేటీఆర్ కూడా మరో పిటీషన్ వేశారు. ఈ రెండు పిటీషన్లను కలిపి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసు విచారణ సందర్భంగా గత విచారణలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అనర్హత నిర్ణయం తీసుకునేందుకు తగిన సమయం కావాలని తెలంగాణ ప్రభుత్వం కోరగా ఇప్పటి వరకూ తీసుకున్న 10 నెలల సమయం సరిపోలేదా అంటూ కోర్టు ప్రశ్నించింది. మీ ఉద్దేశ్యంలో రీజనబుల్ టైమ్ అంటే ఎంత అని అడిగింది. ఆ తగిన సమయం ఎంతో చెప్పకపోతే తామే కలుగుజేసుకుంటామని కోర్టు స్పష్టం చేసింది. ఆ తరువాత విచారణను ఇవాళ్టికి వాయిదా వేసింది.

బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిపై అనర్హత వేటుకు సంబంధించిన కేసు ఇది. ఈ కేసుపై ఇవాళ స్పష్టత వస్తుందని అంతా భావించారు. కానీ తెలంగాణ అసెంబ్లీ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ విచారణకు హాజరు కాకపోవడంతో సుప్రీంకోర్టు ఈ కేసును మార్చ్ 4వ తేదీకి వాయిదా వేసింది. ఈసారి జరిగే విచారణలో ఈ పది మంది ఎమ్మెల్యేల అనర్హతపై స్పష్టత రావచ్చు.

## అమ్మతోడు.. తెలుగు భాషలో ఇన్ని తిట్లు ఉంటాయని నాకు తెలియదు : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మహిళలు దూషిస్తున్న వైనంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. అమ్మతోడు.. తెలుగు భాషలో ఇన్ని తిట్లు ఉంటాయని కూడా నాకు తెలియదు అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కాంగ్రెస్ పాలన అంటే ఏంటో ఇప్పుడిప్పుడే మనోళ్లకు అర్థమవుతుంది. నిజంగా చెబుతున్నా.. మీరు నమ్ముతరో లేదో తెలియదు కానీ.. అమ్మతోడు చెబుతున్నా.. తెలుగు భాషలో ఇన్ని తిట్లు ఉంటాయని నాకు తెలియదు. అరెరె.. ఏం తిట్టుడు అయ్యా అది. భయం లేదు, భక్తి లేదు గొట్టం పెట్టుడే ఆలస్యం.. రమ్మను వాన్ని అంటుర్రు. యేడికెళ్లి వస్తడు వాని భయం వానికుంది.. వస్తే వీపు పగులగొట్టే ఉన్నరు అని కేటీఆర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై మహిళలు దుమ్మెత్తి పోస్తున్న సంగతి తెలిసిందే. తులం బంగారం, స్కూటీలు, నెలకు రూ. 2500, పెన్షన్ల పేరుతో తమను మోసం చేసిందని మహిళలు రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తుతున్నారు. కాంగ్రెస్ పాలనపై మహిళలను పలుకరిస్తే చాలు.. తిట్టకూడని తిట్లతో రేవంత్‌ను ఉతికి ఆరేస్తున్నారు. ఇంకోసారి రేవంత్ రెడ్డి సీఎం అయ్యే ప్రసక్తే లేదని మహిళలు శాపనార్థాలు పెడుతున్నారు.

## కాంగ్రెస్ ఓడిపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా: మెదక్ ఎంపీ రఘునందన్ రావు

మొదటి పేజీ తరువాయి

ఈ కార్ రేస్ కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఏసీబీ రేవంత్ ప్రభుత్వం కంట్రోల్‌లో పని చేసేదే కదా అరెస్ట్ ఎందుకు చేయించడం లేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు అంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఒక్క ఆధారమైనా చూపించాలని ఛాలెంజ్ చేశారు. పాత సీఎస్ సోమేష్ కుమార్ వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని చెప్పిన వాళ్లు.. ఆయనను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రింగురోడ్డు టోల్ గేట్ కుంభకోణంలో రేవంత్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని రఘునందన్ రావు ప్రశ్నించారు.

కాంగ్రెస్‌లో బీసీని ఎందుకు సీఎం చేయలేదు..

అంతకుముందు సిద్దిపేట కొండా భూదేవి గార్డెన్‌లో కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలుపును ఎవరు ఆపలేరని జోస్యం చెప్పారు. ఇద్దరు బీజేపీ అభ్యర్థులు మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలుస్తారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. మిగతా పార్లమెంట్‌లలో కంటే మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువ ఓట్లు సాధిస్తామని అన్నారు. గతంలో గెలిచిన నాయకులు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ పంచన చేరారు, కానీ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని మండిపడ్డారు. ఇతర పార్టీలో నాయకులను కొన్నట్లుగా బీజేపీ పార్టీ నాయకులను కొనలేరని మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఉద్ఘాటించారు.

బీసీలలో ముస్లింలను రేవంత్ రెడ్డి కలిపారని ఆరోపించారు. నూటికి 55శాతం బీసీలు ఉంటే వారికి ఉన్న వాటా ప్రకారం మంత్రి పదవులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎప్పుడు కూడా బీసీని ఎందుకు సీఎం చేయలేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. కేంద్రమంత్రి పదవుల్లో బీసీలకు మోదీ పెద్దపీట వేశారని చెప్పారు. ఒక్క మైనార్టీకి కూడా కాంగ్రెస్ మంత్రి పదవి ఇవ్వలేదని అన్నారు. తనకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదని చెప్పారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ముందుగా ధామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు నిర్ణయించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు

# ఆ విషయం నిరూపించాలి.. రేవంత్‌కు కిషన్‌రెడ్డి మాస్ సవాల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేయడం వల్లనే తాను గట్టిగా రిప్లై ఇవ్వాల్సి వస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదని స్పష్టం చేశారు. దేశం మీద భక్తితో జెండా మీద గౌరవంతో బీజేపీలో మాములు కార్యకర్తగా వచ్చి ఈ స్థాయికి వచ్చానని అన్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్న తనను పట్టుకొని తెలంగాణకు అడ్డుపడ్డ వ్యక్తి అంటూ మాట్లాడటం రేవంత్ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డికి దమ్ము ఉంటే తాను ఎప్పుడు ఎక్కడ తెలంగాణకు అడ్డుపడ్డానో రుజువు చేయాలని సవాల్ విసిరారు. పదవుల కోసం పార్టీలు మారి కాళ్లు పట్టుకొనే వాడిని తాను కాదని తేల్చిచెప్పారు. ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం రేవంత్ చేతిలో ఉంది.. ఆయన ఎలాంటి విచారణ చేస్తారో చేసి తమకు అప్పగించాలని కిషన్ రెడ్డి అన్నారు.

# నాయకుడిగా కాదు సేవకుడిగా వస్తున్నా




**హుస్నాబాద్, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** హుస్నాబాద్ ఆత్మీయ సమ్మేళనం సక్సెస్ తాను నాయకుడిగా కాదు ప్రజలందరికీ సేవకుడిగా పనిచేయడానికి రంగంలోకి దిగానని కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పులి ప్రసన్న హరికృష్ణ స్పష్టం చేశారు హుస్నాబాద్ లో నిర్వహించిన హుస్నాబాద్ నియోజకవర్గ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ప్రసన్న హరికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడానికి తన ఉద్యోగాన్ని వదిలి రాజకీయరంగంలోకి ప్రవేశించానని అన్నారు నిరుపేదల అవస్థలు తనకు స్పష్టంగా తెలుసునని వారి చదువుల కోసం తన వేతనం నుంచి 50% అందించాలని తెలిపారు తనను గెలిపిస్తే విద్య ఉద్యోగ ఉపాధి రంగాలలో యువతకు చేదోడుగా ఉంటానని అన్నారు ప్రసన్న హరికృష్ణ టీం సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ తూమోజు జగదీశ్వర చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి తాళ్ళపల్లి వెంకటేష్‌గౌడ్ బిఎస్‌పి రాష్ట్ర నాయకులు నిమిషాని రామచంద్రం బీసీ సంఘం సీనియర్ నాయకులు కోహెడ కొమురయ్య గౌడ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ సామాజిక విశ్లేషకులు వడ్డేపల్లి మల్లేశం క్యూ న్యూస్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ అఖిమ్ పాషా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్ లో విద్య,యువజన, మహిళా రంగాల అభివృద్ధికి సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలి

## ఎఐయఫ్‌డివై జాతీయ సహాయ కార్యదర్శి గాదగోని రవి




**వరంగల్, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** ఓంకార్ భవన్ బాగ్ లింగం పల్లి హైదరాబాద్ లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అంగడి పుష్ప, అఖిలభారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రాజిరెడ్డి, అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి అధ్యక్షతన రానున్న రాష్ట్ర బడ్జెట్లో తగిన నిధులు కెటాయించాలని రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎ ఐ యఫ్ డి వై జాతీయ సహాయ కార్యదర్శి గాదగోని రవి, డివైయఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ . వెంకటేష్,పి ఓ డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, యస్ యఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, పి ఓ డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు డి. యస్ స్వరూప, ఎ ఐ డి యస్ ఒ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వినోద్ కుమార్, పి డి యస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.అనిల్, ఎ ఐ యఫ్ డి వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్,ఎ ఐ యఫ్ డి డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగసుద, ఎ ఐ యఫ్ డి యస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, మాట్లాడుతూ 2025-2026 సంవత్సరాల కు ప్రవేశ పెట్టే రాష్ట్ర బడ్జెట్లో మహిళా సంక్షేమానికి, యువజన సంక్షేమానికి, విద్యార్థి సంక్షేమానికి వారి జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్ కెటాయింపులు జరుగాలని కాకులను కొట్టి గద్దల కు వేసినట్లుగా కాకుండా ఈ బడ్జెట్ లో శాస్త్రీయ కెటాయింపు లు జరుగాలని ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విదంగా బడ్జెట్ కెటాయింపు ఉండాలని అందులో మహిళా, శిశు సంక్షేమానికి, మహిళా సార్థకత కోసం మొత్తం బడ్జెట్ లో మహిళా రంగానికి పదిహేను వేల కోట్ల రూపాయల బడ్జెట్ కెటాయించాలని ముఖ్యంగా పాఠశాలలలో విద్యార్థినీ లకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించే విధంగా బాత్రూం,ఇతర పాఠశాల సౌకర్యాలను యుద్ద ప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగం ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు అని ఈ బడ్జెట్ సమావేశాల్లో చిత్తశుద్ధితో కూడిన జాబ్ క్యాలెండర్ ప్రకటించి 6 నెలల్లో రాష్ట్రంలో రెండు లక్షలుఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని ఉద్యోగం అవకాశాలు లేని నిరుద్యోగులకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన నెలకు 4 వేల రూపాయలు నిరుద్యోగ భృతి చెల్లించాలని యువజన సంక్షేమానికి బడ్జెట్ లో 20 వేల కోట్ల రూపాయలు కెటాయించాలని అని. విద్యారంగం అభివృద్ధి కి ఈ బడ్జెట్ లో 30 శాతం నిదులు కెటాయించాలని విద్య రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్నందున రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయమని అసెంబ్లీ లో తీర్మానం చేయాలని, రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో విద్యా విధానం అభివృద్ధి కి పెద్ద పీట వేస్తూ ఈ బడ్జెట్ లో నిదులు కెటాయించాలని మండలానికి ఒక మాడల్ స్కూల్ ను మంజూరు చేయాలని, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ నిధులు 7800 కోట్లు విడుదల చేయాలని ఈ సమస్యలను పరిష్కరించాలని యువజన, విద్యార్థి, మహిళా జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్ కెటాయింపు సాధన కోసం గ్రామ గ్రామంలో, ప్రచారం ఆందోళన నిర్వహించాలని కలిసి వచ్చే ప్రజా సంఘాల ను కలుపు కొని పెద్ద ఎత్తున ఆందోళన కు సిద్దం కావాలి అని పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ డి డబ్ల్యు రాష్ట్ర నాయకురాలు కుంభం సుకన్య, వస్కుల సైదక్క, తాంద్ర కళావతి, నాయకురాలు బి విమల,జి శివాని, ఎస్ గీత, లలిత, పార్వతి, ఏఐఎఫ్ డి వై రాష్ట్ర నాయకులు నీలా రవీందర్, డి మధుసూదన్, ఈ దశరథ్ నాయక్, డి శ్రీనివాసులు, ఏఐఎఫ్ డిఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర కోశాధికారి పోతుగంటి కాశి, రాష్ట్ర నాయకులు వాస్కుల భరత్, గడ్డం శ్రీకాంత్ మరియు పి శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మీనారాయణ, శ్రీశివపార్వతుల వటావృక్ష కల్యాణ మహోత్సవము



**వరంగల్, 25 ఫిబ్రవరి(క్రాంతిన్యూస్):** వరంగల్ జిల్లా కాశీబుగ్గ ప్రాంతంలోని 21వడివిజన్ ఎల్బినగర్ లో ఉత్తరాషాడ నక్షత్రంలో శ్రీలక్ష్మీనారాయణ, శ్రీశివపార్వతుల వటావృక్ష కల్యాణ మహోత్సవము హిందూ ముక్తిస్తల్ కమిటీ ఆధ్వర్యంలో పద్మ బ్రాహ్మణులు గజ్జెల రాజ్ కుమార్ శాస్త్రి,కోడం ప్రవీణ్,రాచర్ల రాజు లోక కళ్యానార్థం, నానావిధ ఆత్మానాం గోత్రస్య మహారుద్ర హోమం హిందూముక్తిస్తల్లో నిర్వహించడంజరిగింది. కమిటీ అధ్యక్షులు బూర రాంచందర్ మాట్లాడుతూ ప్రతిసంవత్సరం భక్తులసహకారముతో వటవృక్షంకళ్యాణం నిర్వహించడంజరుగుతుందని స్థానిక నాయకుల,దాతల సహకారముతో హిందూ ముక్తి స్థల్ ను అభివృద్ధిచేయడం జరుగుతుందని సందర్భముగా తెలియజేశారు. ఈకార్యక్రమములో 20వడివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, సముద్రాల పరమేశ్వర్, ఉపాధ్యక్షులు పడాల నరసింగరావు, శీలం బాబురావు, గోషికొండ సుధాకర్, ఇప్ప ఆదినారాయణ, నలువల మురళీ, ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, వర్కింగ్ కార్యదర్శి వంగర భాస్కర్, సహాయ కార్యదర్శులు ఆకేన వెంకటేశ్వర్లు, గుములపురం ఉప్పలయ్య, గాదె ప్రభాకర్, కోశాధికారి ఉప్పుల రమేష్, సహాయ కోశాధికారి అంబటి అశోక్ కుమార్, సుంకనపెల్లి శ్రీనివాస్, ప్రతాపని సుధాకర్, టీ.వి.అశోక్ కుమార్, పెరుమాండ్ల సురేష్, భాకం హరిశంకర్, వంగరి సూర్యనారాయణ, బింగి మహేష్, పరమేశ్, మధు, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు పరామర్శ



**ఇనుగుర్తి, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** ఇనుగుర్తి మండలం లో బి ఆర్ ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మృతి చెందిన కుటుంబాలను మంగళవారం పరామర్శించారు.. వివరాలు ఇలా ఉన్నాయి. ఇనుగుర్తి మండల కేంద్రంలో గండు సత్యమ్మ(70) ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుమారులైన గండు నాగయ్య గండు రమేష్ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం లాలు తండా మాజీ ఉపసర్పంచ్ గుగులోత్ నరేందర్ తండ్రి తావుర్య మరణించగా వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి, హరిచంద్. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతం అయిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వారోస్సవాలు.




**ఖమ్మం,25ఫిబ్రవరి(క్రాంతిన్యూస్):** సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వారోస్సవాలు విజయవంతం చేసినందుకు రాష్ట్ర అధ్యక్షులు భూక్యా శోభన్ నాయక్, ప్రధానకార్యదర్శి బి. లచ్చునాయక్, కోశాధికారి దారావత్ రాములు నాయక్ ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మారుమూల గోర్ బంజారా తండలా నుండి హైదరాబాద్ లోని రవీంద్ర భారతి ఢిల్లీ లోని రాంలీల మైదానం వరకు సంత్ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఒక జ్ఞాన యజ్ఞం లాగ యావత్తు బంజారా జాతి ఐక్యం గా జరుపుకోవడం మన జాతి ఓనత్యం అన్నారు.రాబోవు రోజులలో జాతికి శుభ సూచకం అని తెలిపారు.ఈ సందర్భంగా సంఘం నిర్వహించిన కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. బంజారా భవన్ ఖమ్మం,రఘునాథపాలెం జింకల తండా స్టేజి వద్ద, పాలేరు నియోజకవర్గం కూసుమంచి, పాండురంగాపురం దేవాలయం దగ్గర, ఖమ్మం సాయి గణేష్ నగర్ పెద్ద తండా, ఖమ్మం రూరల్ యూపీహెచ్ కాలనీ సేవాలాల్ దేవాలయం, ఖమ్మం సూర్యతండా ఏన్కూర్, ఖమ్మం ఏ ఎహె ఎస్ మూలపోచారం, ఏన్కూర్ ఖమ్మం ఆరెకోడు తండా, ఖమ్మం రూరల్, ఖమ్మం లలో జరిగిన ఉత్సవాలలో తెలంగాణ గోర్ బంజారా ఫెడరేషన్ రాష్ట్ర జిల్లా కమిటీ లు మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు, అని తెలిపారు. అదేవిదంగా దేశ వ్యాప్తంగా 15కోట్ల మంది గోర్ బంజారాలు ఉత్సాహంగా ఈ జయంతి ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేశారన్నారు.

# కమ్యూనిస్టుల పునఃరికరణ తక్షణావసరం

## -కార్పొరేట్ వర్గాల చేతుల్లో దేశ రాజకీయాలు.

## -సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ.

## -వరంగల్ జిల్లాలో సిపిఐ శత వసంతాల భారీ ప్రదర్శన సభ.




**వరంగల్, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** వరంగల్ జిల్లా అబ్బూస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సేవా కార్యక్రమంలో నారాయణ మాట్లాడుతూ దేశంలో వరంగల్ కమ్యూనిస్టుల పునఃరికరణ తక్షణఅవసరం అని సిపిఐజాతీయకార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)100వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా వరంగల్ జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలోభారీ ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ శతవసంతాల సందర్భంగాస్థానిక ఇస్లామియా కాలేజ్ గ్రౌండ్ నుండి పోచమ్మ మైదాన్ మీదుగా ఎల్బీనగర్ అబ్బూస్ ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈప్రదర్శనలో సిపిఐ నాయకులు,కార్యకర్తలు ఎర్రజెండాలు చేతబూని సిపిఐ జిందాబాద్.. మార్క్సిజం, లెనినిజం వర్ధిల్లాలిఅంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షత వహించగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సిపిఐ పార్టీ 100 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, త్యాగాలచరిత్ర, పోరాటాల చరిత్ర కలిగిన చరిత్ర సిపిఐ దేనని అన్నారు. అలాంటి సిపిఐ జెండా పట్టుకొని నిరంతరం పేద ప్రజలపక్షాన పోరాడుతామని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు బలబడాల్సిన అవసరంఉందని, అందుకు కమ్యూనిస్టులు పునరేకీకరణ కావాలన్నారు. సమాజంలోని బడుగు బలహీన వర్గాలకోసం అనునిత్యం పోరాడేది కేవలం ఎర్రజెండా మాత్రమేనని, అట్లాంటి ఎర్రజెండా వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గొప్ప విషయమని అన్నారు. అందులోఅనేక త్యాగధనులతో నిండిన వారసత్వ పోరాటాన్ని ఉనికి పుచ్చుకొని ముందుకు నడుస్తామని చెప్పారు. ఓట్లు, సీట్లు ఎత్తులచిత్తుల ప్రలోభాలకు లొంగకుండా రాగద్వేషాలకు అతీతంగా కులమతాలకు,ప్రాంతాలకు అతీతంగా పోరాడేది, పోరాడుతున్నది కేవలం సిపిఐ మాత్రమేనని అన్నారు. దేశంలోరాజకీయాలు కార్పొరేట్ వర్గాలచేతుల్లో ఉన్నాయని పెట్టుబడి దారివర్గ మతోన్మాదపార్టీలైన బిజెపి ఆదానిఅంబానీలకు ఊడిగం చేస్తున్నాయని అలాంటిపార్టీల మెడలు వంచడం కేవలం ఎర్రజెండాతోనే సాధ్యమని అన్నారు. ఏడు జన్మలెత్తిన మోడీ అమిత్ షా పేదల ఉద్యమాలను అణిచి వేయలేరని నారాయణ అన్నారు సీపీఐ రాష్ట్రసహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మావోయిస్టుపార్టీ పందాలు మార్చుకొని ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలు చేయాలని దేశంలో కమ్యూనిస్టులతోకలిసి పోరాటాలుచేయాలని సీపీఐ రాష్ట్రసహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు.ఈకార్యక్రమంలో సిపిఐరాష్ట్రకార్యవర్గ సభ్యురాలు బి విజయసారధి, కర్రే బిక్షపతి రాష్ట్రసమితి సభ్యులు టి వెంకట్ రాములు పంజాల రమేష్ జిల్లాసహాయ కార్యదర్శి షేక్ బాసుమియా, పనస ప్రసాద్ నాయకులు బుస్సా రవీందర్,గుండె బద్రి ఎలేందర్, కేతరాజు ఉప్పలయ్య దండు లక్ష్మణ్,గన్నారపు రమేష్ అక్కపల్లి రమేష్ వలి ఉన్న కదిరి,కందిక చెన్నకేశవులు,జన్ను రవి, లేదర్ల శరత తాళ్లపల్లి రాయల,ఎండి అక్బర్, ఓర్సు రాజు. గడ్డం యాకయ్య,వీరగోని శంకరయ్య,చింతకింది కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గోడప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.




**ఖమ్మం, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన గోడప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎల్డిఎం శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ షఫీయుల్లా ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# నరేందర్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తల ప్రచారం



**అక్కన్నపేట 25 ఫిబ్రవరి(క్రాంతిన్యూస్ ):** అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామంలో ఈరోజు ఎంఎల్సి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వుట్కూరి నరేందర్ రెడ్డి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ అంతకపేట గ్రామ శాఖ అధ్యక్షుడి ఆద్వర్యం లో మొదటి ప్రాధాన్యత ఓటు నరేందర్ రెడ్డికి వేయాలని కాంగ్రెస్ పార్టీ కి మద్దతు తెలుపాలని గ్రామం లో ప్రచారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కోళ్ల లక్ష్మరెడ్డి మహేందర్ రెడ్డి బండి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# వైసీపీకి మరో షాక్..

## గట్టి దెబ్బ తీసిన బాలినేని..!



ఏపీలో విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీకి పలువురు కీలక నేతలు రాజీనామా చేశారు. మరికొందరు రాజకీయాలకు దూరమయ్యారు. ఇక కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ ఛైర్మన్లు వంటి నేతలు చాలా మంది కండువా మార్చేశారు. తాజాగా ఒంగోలు జిల్లాలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ఒంగోలు డిప్యూటీ మేయర్ సహా 20 మంది వైసీపీ కార్పొరేటర్లు జనసేనలో చేరిపోయారు. కార్పొరేటర్లు, కో-ఆప్షన్ మెంబర్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కొద్దికాలానికి బాలినేని శ్రీనివాస్ రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన సంగతి తెలిసిందే. ఇక ఒంగోలులో జనసేన పార్టీని బలోపేతం చేయడంపై బాలినేని ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే వైసీపీలో అసంతృప్తితో ఉన్న నేతలను బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన వైపు ఆకర్షిస్తున్నట్లు తెలిసింది.

ఒంగోలు కార్పొరేషన్‌లో మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైసీపీ నుంచి 41 మంది కార్పొరేటర్లు గెలిచారు. ఆ తర్వాత ఇండిపెండెంట్లుగా గెలిచిన ఇద్దరూ వైసీపీలో చేరిపోయారు. దీంతో వైసీపీ బలం 43కు చేరింది. దీంతో వైసీపీ తరుపున మేయర్‌గా గంగాడ సుజాతను ఎన్నుకున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అధికారం వైసీపీ నుంచి టీడీపీ కూటమి చేతిలోకి రావటంతో ఒంగోలు మేయర్ సుజాత సహా 19 మంది వైసీపీ కార్పొరేటర్లు పార్టీ మారిపోయారు. టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో వీరంతా అప్పట్లో టీడీపీ కండువా కప్పుకున్నారు. మిగిలిన వైసీపీ కార్పొరేటర్లలో తాజాగా డిప్యూటీ మేయర్ మాధవ్ సహా 20 మంది కార్పొరేటర్లు జనసేన గూటికి చేరిపోయారు. దీంతో ఒంగోలులో వైసీపీకి నలుగురు కార్పొరేటర్లు మాత్రమే మిగిలారు.

ఎన్నికల సమయంలో టీడీపీకి ఆరుగురు, జనసేనకు ఒక కార్పొరేటర్ ఉండేవారు. పార్టీ మార్పుల తర్వాత టీడీపీకి ఉన్న కార్పొరేటర్ల బలం 25కు చేరింది. అలాగే జనసేన బలం 21కి పెరిగింది. వైసీపీకి నలుగురు సభ్యులు ఉన్నారు. దీంతో ఒంగోలు కార్పొరేషన్‌పై మీద టీడీపీ కూటమి పట్టు సాధించింది. అటు కాకినాడ జిల్లా తునిలో కూడా వైసీపీకి షాక్ తగిలిన సంగతి తెలిసిందే. ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోయారు. యనమల రామకృష్ణుడు సమక్షంలో వీరంతా టీడీపీ కండువా కప్పుకున్నారు. దీంతో మెజార్టీ కౌన్సిలర్లు టీడీపీలో చేరినట్లైంది.

# గుండాల కోన ఘటన ఎఫెక్ట్..

## మహా శివరాత్రి వేళ అధికారులకు పవన్ కీలక సూచనలు



అన్నమయ్య జిల్లా గుండాల కోన అటవీ ప్రాంతంలో ఏనుగుల దాడిలో ముగ్గురు చనిపోయిన ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. మహా శివరాత్రి పండుగ వేళ.. గుండాల కోన శివాలయానికి వెళ్ళిన ముగ్గురు భక్తులు ఏనుగుల తొక్కిసలాటలో దుర్మరణం పాలవడం బాధాకరమని అన్నారు. ఇలాంటి దుర్ఘటనలు మరోసారి జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను పవన్ కళ్యాణ్ ఆదేశించారు. మహా శివరాత్రి సందర్భంగా అటవీ ప్రాంతంలో ఉండే ఆలయాలకు వెళ్ళే భక్తుల రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని అటవీశాఖ అధికారులను పవన్ ఆదేశించారు. ఇందుకోసం పోలీసు, దేవాదాయ, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

గుండాల కోన దుర్ఘటన నేపథ్యంలో మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్.. అటవీ శాఖ ఉన్నతాధికారులు, అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ, వన్యప్రాణి సంరక్షణ అధికారులతో డిప్యూటీ సీఎం పలు అంశాలపై చర్చించారు. ఏనుగులు సంచరించే ప్రాంతాలలో ఉండే ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వారికి రక్షణ కల్పించాలని సూచించారు. కర్ణాటకలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారన్న పవన్ కళ్యాణ్.. అలాంటి సాంకేతిక పరిజ్ఞానాలను, విధానాలను పరిశీలించి అమలు చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఏనుగుల కదలికలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో రైల్వే లైన్ బారికేడింగ్ చేయాలని సూచించారు.

అలాగే ఏనుగుల కదలికను ట్రాక్ చేయడానికి రేడియో కాలరింగ్ ఏర్పాటు చేయాలని.. అధునాతన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు. స్థానికంగా ఉండేవారితో పాటుగా అటవీ ప్రాంతాల్లోని ఆలయాలకు వెళ్ళే భక్తులకు ఏనుగుల ప్రవర్తన, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతాపరమైన చర్యల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

మనుషుల భద్రతతో పాటుగా వన్యప్రాణుల సంరక్షణను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరిష్కార మార్గాలను కనుగొనాలని.. వాటితో నివేదిక తయారుచేసి సమర్పించాలని అధికారులను పవన్ కళ్యాణ్ ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనలో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు.

# మన మిత్ర ద్వారా వేయి పౌర సేవలు..!

## ఇక వాట్సాప్ ఉంటే చాలేమో..



ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ ఊరట ఇచ్చే వార్త వినిపించారు. సర్టిఫికేట్లు, పన్నులు చెల్లింపు ఇలాంటి అవసరాల కోసం ఇకపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా.. చంద్రబాబు కీలక చర్యలు చేపడుతున్నారు. సాంకేతికతకు పెద్దపీట వేస్తూ పాలన సాగిస్తున్న చంద్రబాబు.. అందులో భాగంగా ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ప్రజలకు పౌర సేవలను మరింత సులభంగా అందించాలనే ఉద్దేశంతో మెటా భాగస్వామ్యంతో ఈ వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించారు. మన మిత్ర పేరుతో వాట్సాప్ ద్వారా 161 సేవలు అందిస్తున్నారు. అయితే త్వరలోనే వాట్సాప్ ద్వారా పౌర సేవలను మరింత విస్తరించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు.


వాట్సాప్ ద్వారా త్వరలోనే వేయి సర్వీసులు అందించనున్నట్లు చంద్రబాబు మంగళవారం ప్రకటించారు. ప్రజలకు మరింత సులభంగా పౌర సేవలు అందించాలనేదే తమ ప్రభుత్వం ఉద్దేశమన్నారు చంద్రబాబు. అలాగే ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందంటూ చంద్రబాబు హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇష్టారీతిన వ్యాఖ్యలు చేసేవారని ఉపేక్షించేది లేదని.. మహిళల ఆత్మగౌరవం దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మరోవైపు సోమవారం సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీపై చంద్రబాబు నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాట్సాప్ ద్వారా అందిస్తున్న పౌర సేవల్లో ఎదురయ్యే సమస్యలపై స్పందించేందుకు వాట్సాప్ గవర్నెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. వాట్సాప్ సేవల్లో భాగంగా రైతు బజార్లు, నిత్యావసర షాపుల వద్ద కూడా క్యూఆర్ కోడ్ ప్రదర్శించాలని దేశించారు. వాట్సాప్ నంబర్ 95523 00009కు మెసేజ్ పంపడం ద్వారా కావాల్సిన సేవలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం విద్యుత్తు, హాల్ టికెట్లు వంటి సేవలు అందుబాటులో ఉంచినట్లు చంద్రబాబు చెప్పారు.

మరోవైపు మన మిత్ర కార్యక్రమం కింద తొలి విడతగా మొత్తం 161 రకాల పౌర సేవలను ప్రభుత్వం వాట్సాప్ ద్వారా అందిస్తోంది. తొలి విడతలో విద్య, దేవాదాయ, ఇంధన, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల్లోని సేవలు అందిస్తున్నారు. సేవలు అందించడంతో పాటుగా ప్రభుత్వం పౌరులకు ఏదైనా సమాచారాన్ని చేరవేయాలంటే ఈ వాట్సప్ ద్వారా సందేశాలు పంపించనుంది. తద్వారా ఒకేసారి కోట్ల మందికి సమాచారాన్ని చేరవేయవచ్చని అధికారులు చెప్తున్నారు.



# అందుకే పవన్‌ను మోదీ హిమాలయాలకు వెళ్లిపోమన్నారు.. కేఏ పాల్ సెటైర్




ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పవన్ కళ్యాణ్‌కు సమస్యలు తెలుసుకానీ.. వాటికి సొల్యూషన్స్ తెలియవని ఎద్దేవా చేశారు. అందుకే హిమాయాలకు వెళ్లిపోవాలని, నీకు రాజకీయం రాదని ముఖం మీదే ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారని, ఇది అర్థం కాక ఆయన నవ్వుతున్నారని వ్యాఖ్యానించారు. ఢిల్లీ సీఎం రేఖాగుప్తా ప్రమాణస్వీకారానికి హాజరైన పవన్‌ను చూసి మోదీ చమత్కరించిన విషయం తెలిసిందే. పవన్ మాటలు, చేష్టలు ప్రజలందరికీ అర్థమైపోయిందని, ఆయన రాజకీయాలకు పనికిరానని తెలిసిపోయిందని అన్నారు. ప్రతిపక్ష హోదా కోసం జగన్ పోరాటం ఆపేసి.. ప్రజా సమస్యల కోసం అసెంబ్లీలో నిలదీయాలని డిమాండ్ చేశారు.

# గజవాహనంపై కటాక్షించిన భ్రమరాంబ సమేత శ్రీశైలం

జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో శ్రీశైల పురవీధులన్నీ శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. ఉత్సవాల్లో ఏడో రోజు మంగళవారం ఉదయం చండీశ్వరపూజ, మండపారాధన, కలశార్చన, శివపంచాక్షరీ, జపానుష్టానాలు, రుద్రపారాయణలు, రుద్రహోమం, చండీహోమం జరిపించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

సాయంకాలార్చనలు హోమాల అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన గజవాహనంపై వేంచేపు చేసి అక్కమహాదేవి అలంకార మండపంలో షోడశోపచార పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం నిర్వహించగా.. భక్తుల జయజయ ధ్వానాలు మిన్నంటాయి. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు, నందిమండపం నుంచి బయలువీరభద్ర స్వామి వరకు ఆద్యంతం వైభవంగా సాగింది. శోభాయాత్రలో చెంచు కళాకారుల జానపదాలు, కోలాటాలు, వేషధారణలు, నృత్యాలు అలరించాయి. అనంతరం కాళరాత్రిపూజ, మంత్రపుష్పం, స్వామిఅమ్మవార్లకు ఆస్థానసేవలు నిర్వహించారు.

గజం అంటే ఐశ్వర్యానికి, అంగబలానికి, ఆదిపత్యానికి ప్రతీక. శ్రీశైల శ్రీ మల్లికార్జున స్వామి శ్రీ లింగ మహాచక్రవర్తి. జయజయ ధ్వానాల నడుమ జగన్మాత భ్రమరాంబిక అమ్మతో కలిసి అధిరోహించి దర్శనమిచ్చారు. గజవాహన సేవలో స్వామి అమ్మవార్లను దర్శించడం వల్ల అష్టైశ్వర్యాలు కలిగి.. కొండంత అండగా ఉంటానని అభయమిస్తున్నట్లుగా భక్తులు విశ్వసిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ మాడవీధిలోని భ్రామరీ కళావేదికతోపాటు పుష్కరిణి, శివదీక్షా శిబిరాల వద్ద ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.



# గజవాహనంపై కటాక్షించిన భ్రమరాంబ సమేత శ్రీశైలం

## పరిశీలించిన డీఐజీ ప్రవీణ్

శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీశైలంలో కొనసాగుతున్నాయి. శివరాత్రి సందర్భంగా బుధవారం భారీగా భక్తులు తరలిరానున్నారు. ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్లను కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ పరిశీలించారు. నంద్యాల ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి క్షేత్ర పరిధిలో పర్యటించారు. దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు, ఆలయ పరిసరాలను పరిశీలించారు. సీసీటీవీల కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఎస్పీ నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి ఉన్నారు.



మన క్రాంతి KR TV ఇది వాస్తవ పత్రిక...



# ప్రజా ప్రభుత్వం పై విమర్శలు తగవు

## -కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షులు కూరెల్లి సతీష్




**ఇనుగుర్తి, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** ఇనుగుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలను ఖండించారు. వివరాలిలా ఉన్నాయి బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, సార దందాలో జైలుకి వెళ్లిన ఎమ్మెల్సీ కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,వేం నరేందర్ రెడ్డిని విమర్శించే అర్హత లేదని గత పది సంవత్సరాల కాలంలో బి ఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సంకెళ్లు వేసిన నోరు మెదపకుండా,పదవి పోయిన అనంతరం రైతుల పక్షాన పోరాడుతున్నట్లు నటించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చిన్నాలకట్టయ్య, గుజ్జునూరి బాబురావు,కొట్టం రాము, వల్లంల మురళి, శ్యామ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ ఫోర్స్ వుట్కూరి నరేందర్ రెడ్డినే గెలిపించండి



**హుస్నాబాద్, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** పట్టభద్రులను విజ్ఞప్తి చేసినా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఉమ్మడి మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ జిల్లాలోని పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్ ఫోర్స్ నరేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయనకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చాడ వెంకటరెడ్డి ప్రకటించారు మంగళవారం నాడు హుస్నాబాద్ పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనం లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుధీర్ఘ కాలంగా అల్ ఫోర్స్ స్కూల్ కాలేజీలు ఏర్పాటు చేసి లక్షలాది మంది విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దిన వుట్కూరి నరేందర్ రెడ్డికి మెదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని హుస్నాబాద్ పట్టణంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్నార ప్రభుత్వ ప్రయివేట్ ఉద్యోగులను నిరుద్యోగులు స్వయంగా కలిసి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డికి మెదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని చాడ వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ జెఎసి కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి జెఎసి కొ ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ సిపిఐ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు బొయిని అశోక్ చిగురుమామిడి మాజీ జెడ్పీటీసీ సభ్యులు అందే స్వామి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేష్ జాగీర్ సత్య నారాయణ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజివరెడ్డి ఎగ్గోజు సుదర్శన్ చారి తెలంగాణ రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి సిద్దిపేట జిల్లా కార్యదర్శి వెల్పుల శ్రీనివాస్ జనగాం రాజు కుమార్ సిపిఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి కాల్వల ఎల్లయ్య ఎండి అక్బర్ పొదిల కుమారస్వామి జెఎసి నాయకులు డ్యాగల సారయ్య డాక్టర్ ఎదులపురం తిరుపతి ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్ ఐలవేని ప్రసాద్ యాదవ్ చెప్యాల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎండ కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి.ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. సీ.పీ.ఐ.



ఖమ్మం,25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):రోజు రోజుకి ఎండల తీవ్రత పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీ.పీ.ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ సలాం డిమాండ్ చేశారు.ఈ రోజు స్థానిక లెనిన్ నగర్లో ఎస్.కె చాన అధ్యక్షతన ముఖ్యుల సమావేశం జరిగింది. సలాం మాట్లాడుతూ ఇప్పుడే 3రోజులకు 2రోజులకు ఒక సారి 20 నిమిషాలు మాత్రమే నీళ్ల వస్తున్నాయని రానున్న రోజుల్లో పరిస్థితి ఏట్ల ఉంటుందో అర్థం చేసుకోవచ్చని అందుకోసమే అధికారులు ముందు జగ్రత్త చర్యలు తీసుకోవాలని గతంలో ఖమ్మం నగరం ఒకటే ఉండేది, ఇప్పుడు చుట్టు పక్క ప్రాంతాలు మొత్తం ఖమ్మం కార్పొరేషన్లో కలిసాయి. మనకు జనాభాకు సరిపడే అంత వాటర్ఫిల్టర్ బెల్ట్ సమర్ధ్యం లేదు. రోజంతా ఫిల్టర్ అయితే రెండు రోజులకు ఒక సారి నీళ్ల వస్తున్నాయన, అందుకోసమే ఖమ్మం లో స్టోరేజ్ ట్యాంక్ ని ఏర్పాటు చెయ్యాలని, వాటర్ ఫిల్టర్ బెల్ట్ సమర్థ్యాన్ని పెంచాలని,ముందు జాగ్రత్తగా జనరేటర్ ను ఏర్పాటు చెయ్యాలని స్పేర్ లో మోటార్స్ నీ పెట్టాలని ఇప్పుడే మోటర్స్ కలిపోతున్నాయని, రెండు రోజులు నీళ్ళు రావట్లేదని అందుకోసమే మోటార్స్ నీ ముందు జాగ్రత్తగా ఏర్పాటు చేసుకోవాలని సీ.పీ.ఐ డిమాండ్ చేస్తుంది.ఈ సమావేశంలో నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, త్రీ టౌన్ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్, జల నరసింహారావు ఎస్.కె చాన ఎం.డి,రెహమాన్,ఎస్. కె కలేశ, ఎస్.కె రఫీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పై శిక్షణ కార్యక్రమం.



ఖమ్మం,25ఫిబ్రవరి(క్రాంతిన్యూస్):ఈ రోజు స్థానిక ఐ.డి.ఓ.సి సమావేశ మందిరంలో జిల్లాలో పని చేయుచున్న వైద్యధికారులకు, ఫార్మాసిస్టులకు మరియు ఆరోగ్య సిబ్బందికి ఈ విన్, యూ.విన్ యాప్ లు అప్ డేట్ పై, సాధారణ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి మాట్లాడుతూ ఈ పై ఆప్స్ ఎప్పటికప్పుడు ఫార్మాసిస్ట్, ఏ.ఎన్.ఎం లు అప్ డేట్ చేస్తూ వ్యాధి నిరోధక టీకాలు అందించాలని వాటిలో ఏదైనా సమస్య ఉంటే ఎస్.ఎం.ఓ ని అడిగి అనుమానలు నివృత్తి చేసుకొని కార్యక్రమాన్ని నూరు శాతం విజయవంతం చేయాలని కోరారు. అలాగే అసంక్రమణ వ్యాదులు నియంత్రణ కార్యక్రమం, మాతా శిశు సంక్షేమం, లెప్రసీ నివారణ కార్యక్రమం ఇచ్చిన లక్ష్యలను మార్చి నెలాకరు వరకు సాధించాలని ఆమె తెలిపారు. తదనంతరం రాష్ట్ర అధికారిని డాక్టర్ జోష్నా, ఎస్ ఎం ఓ డాక్టర్ మురారీ శిక్షణ కార్యక్రమం అందించారు. ఈ కార్యక్రమంలో డీప్యూటీ డి ఎం ఎచ్ ఓ డాక్టర్ సైదులు, పిఓ(సి హెచ్ ఐ)డాక్టర్ చందునాయక్, పిఓ(ఎన్.సి డి)డాక్టర్ రామారావు, పిఓ (ఎయిడ్స్, లెప్రసీ )డాక్టర్ వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు

# రాష్ట్ర అభివృద్ధి బిజెపి అభ్యర్థి చిన్న మైల్ అంజిరెడ్డి తోనే సాధ్యం.



**ఎల్కతుర్తి, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** ఎల్కతుర్తి మండల కేంద్రంలో మంగళవారం రోజున బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్ ఆర్ ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు అందిస్తున్న వ్యక్తి చిన్న మైల్ అంజిరెడ్డి గెలిచిన తర్వాత తన జీతం డబ్బులతో ప్రభుత్వ పాఠశాల ల పునర్ధరన ఉమ్మడి కరీంనగర్ నిజాంబాద్ ఆదిలాబాద్ మెదక్ నియోజక వర్గాల ఎమ్మెల్సీ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి చిన్న మైల్ అంజిరెడ్డి గెలుపు కోసం ఎల్కతుర్తి మండల బిజెపి కార్యకర్తలు గెలుపు కోసం గడపగడప తిరుగుతూ ప్రచారం చేయడం జరిగింది ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఫ్రీ హెల్ప్ లైన్ ప్రారంభిస్తానని తెలంగాణ అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని పట్టభద్రులు ఆలోచించి చిన్న మైల్ అంజిరెడ్డి గెలుపు కోసం మొదటి ప్రాధాన్యతగా గెలిపించాలని ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రామారావు ఎలుకతుర్తి మాజీ సర్పంచి కొమ్మిడి నిరంజన్ రెడ్డి అల్లి కుమార్ నాంపల్లి అశోక్ డాక్టర్ దేవేందర్ రెడ్డి చదిరాల వెంకటేష్ జనగాని కిష్టయ్య కోడెం రమేష్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు ఈ ఎన్నికలు

## రెఫరండం లాంటివే బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు



**హుస్నాబాద్, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన ఓడిన నష్టం లేదనే సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యల అంతర్యాన్ని అర్థం చేసుకోవాలి.ప్రభుత్వానికి వచ్చే నష్టం లేదనే భావనలో ఉన్న రేవంత్ రెడ్డికి పట్టభద్రులు టీచర్స్ తగిన గుణపాఠం చెప్పాలి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినా ఓడిన ప్రభుత్వానికి వచ్చే నష్టంమేమి లేదనే భావనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి పట్టభద్రులు టీచర్స్ తగిన గుణపాఠం చెప్పాలని బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ ముఖ్య నేతలు పోలింగ్ బూత్ బాధ్యులతో రివ్యూ సమావేశం జరిగింది ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ పట్టభద్రులు టీచర్స్ అంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి లెక్క లేనట్లు ఉందని అందుకే నిన్నటి సభలో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచిన ఓడిన ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ లేదనే అహంకారంతో ఉన్నారన్నారు పట్టభద్రుల టీచర్స్ పట్ల గౌరవం లేదని సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏ ఒక్కరూ విశ్వసించడం లేదన్నారు పట్టభద్రులు టీచర్స్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపట్ల విముఖతతో ఉన్నారని తెలిపారు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు టీచర్స్ తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు పట్టభద్రులు టీచర్స్ ఈ ఎన్నికల్లో బిజెపి వైపు ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదన్నారు.ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యలు భారీ మెజారిటీతో గెలిచే అవకాశం ఉందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు ఈ సమావేశంలో హుస్నాబాద్ అసెంబ్లీ కన్వినర్ గురల లక్ష్మారెడ్డి కరీంనగర్ జిల్లా కార్యదర్శి వీరమళ్ళ రవీందర్ రెడీ హుస్నాబాద్ నియోజకవర్గ వివిధ మండలల పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, భూక్యా సంపత్ నాయక్ రామంచ మహేందర్ రెడ్డి జాలిగాం రమేష్ శ్రీరాంమోజు శ్రీనివాస్ మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ దంచనల శ్రీనివాస్ పోలోజు సంతోష్ పలువురు బిజెపి సీనియర్ నాయకులు పృథ్వి రాజు పిల్లి నర్సయ్య పొనం శ్రీనివాస్ మోహన్ నాయక్ తిరుపతి నాయక్ తదితరులు పాలుగోన్నారు

# బహుమతి ప్రదానం చేసిన కట్కూరి దేవేందర్ రెడ్డి,

పరకాల, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్): కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ల ఆధ్వర్యంలో గ్రీన్ టైగర్స్ టైగర్స్ క్రికెట్ టోర్నీ కిడ్స్ పంపిణీ చేసినారు. పరకాల పట్టణానికి చెందిన మైనారిటీ యువకుల గ్రీన్ టైగర్స్ క్రికెట్ టీం కి జెర్సీ పంపిణి చేశారు. మాజీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి. అలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅథిదిగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమము లో మల్లక్కపేట మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ, పరకాల మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, పరకాల పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మంద నాగారాజు ,కాంగ్రెస్ సీనియర్ నాయకులూ గుడెల్లి సదన్ ,ఉడుత సంపత్ ,దాసు, డా,, రోహిత్ ,వెంకటేష్ రాకేష్ లు పాల్గొన్నారు.

# మార్చి 31 లోపు ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను, పరిష్కరించాలి,జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు.నీటి వనరుల వివరాలను రికార్డుల ప్రకారం పటిష్టంగా నమోదు చేయాలి.



**ఖమ్మం, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** మార్చి 31 లోపు ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్,ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎల్.ఆర్.ఎస్. పై నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, టౌన్ ప్లానింగ్, సుడా, కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను ప్రాసెస్ చేసి పరిష్కరించాలని, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల వద్ద అధికంగా ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని,మార్చి 31 లోపు ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను 3 దశలలో స్క్రూటినీ చేయాల్సి ఉంటుందని అన్నారు. ప్రభుత్వ భూములు, కోర్టు కేసులు, నీటి వనరుల బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్. పరిధిలో లేకుండా క్లియర్ గా ఉన్న భూముల ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను ఆమోదించాలని తెలిపారు.రెవెన్యూ శాఖ పరిధిలో ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల స్క్రూటినీకి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు వారి సిబ్బందికి ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల స్క్రూటిని కోసం ప్రతిరోజు లక్ష్యాలు నిర్దేశించాలని అన్నారు. అవసరమైన సిబ్బందిని డిప్యూట్ చేసుకుని లక్ష్యం పూర్తి చేయాలని తెలిపారు.మన దగ్గర ఉన్న సమయంలో పెండింగ్ ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల స్క్రూటిని ఎలా పూర్తి చేయాలో పక్కా ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో 14 బృందాలు ఏర్పాటు చేయాలని, ప్రతి బృందానికి రోజుకు లక్ష్యాలు నిర్దేశించుకుని పని చేయాలని అన్నారు.ఎల్.ఆర్.ఎస్. కు అవసరమైన మేర లాగిన్ లు రెవెన్యూ , నీటిపారుదల శాఖ వారీగా చేయాలని, అవసరమైన సిబ్బంది డిప్యూటేషన్ కోసం ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ తెలిపారు. నీటిపారుదల శాఖ పరిధిలో తనిఖీ చేసే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో నీటి వనరుల బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్. లో ఉండవద్దని అన్నారు. పట్టణంలో నాలాల ఆక్రమణ కాకుండా ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పరిశీలించాలని, లేఅవుట్ క్రమబద్ధీకరణ సమయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అప్రోచ్ రోడ్డు, ప్లాట్ల మధ్య రోడ్డు సరిగా ఉండే విధంగా చూడాలని అన్నారు. సమీక్ష లో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ, ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసిందని, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో దరఖాస్తులను ఫాస్ట్ ట్రాక్ చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, ఆర్.ఐలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గవర్నర్ ను కలిసిన మల్లెమడుగు విద్యార్థులు




**ఖమ్మం, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):** మల్లెమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థులు మంగళవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిశారు.పీ.ఎం శ్రీ పథకం క్రింద ఎక్స్ ప్లోజివ్ విజిట్ లో భాగంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ ల ప్రోద్బలంతో రాజ్ భవన్ ను విద్యార్థులు సందర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో అమలు అవుతున్న కిచెన్ గార్డెన్స్ విధానం గురించి గవర్నర్ తెలుసుకున్నారు. పాఠశాలలో పండించే కూరగాయలతో మధ్యాహ్న భోజనం అందించడాన్ని గవర్నర్ అభినందించారు.మల్లెమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాజభవన్ పర్యటనకు గాను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఏర్పాట్లను చేశారు. విద్యార్థులు గవర్నర్ కు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేసి విద్యార్థులు గీసిన గవర్నర్ చిత్రపటాన్ని బహుమతిగా అందజేశారు. రాజ్ భవన్ ను విద్యార్థులకు పూర్తిస్థాయిలో చూపించేలా గవర్నర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గవర్నర్ ఆదేశాల మేరకు పిల్లలకు అధికారులు రాజ్ భవన్ ను పూర్తిగా చూపించారు. గవర్నర్ ను కలిసిన విద్యార్థులు రాజ్ భవన్ లో చాలా సంతోషంగా గడిపారు.అనంతరం రాష్ట్ర గవర్నర్ ను విద్యార్థిని విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, జిల్లా యంత్రాంగం ఘనంగా సత్కరించింది.ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ అధికారి రామకృష్ణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణ వేణి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు – మాజీ ఎంపీ నామ.



**ఖమ్మం,25ఫిబ్రవరి(క్రాంతిన్యూస్):** మహా శివరాత్రి పండుగ పర్వ దినాన్ని పురస్కరించుకుని బీ.ఆర్.ఎస్ మాజీ లోక్సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎం.పీ నామ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు శివరాత్రి పండుగను అంగరంగ వైభవంగా ఘనంగా జరుపుకోవాలని, తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. శివ జాగరణలో పరమ శివుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి, కోర్కెలు నెరవేర్చుకోవాలన్నారు. శివుని కృపతో రాష్ట్ర ప్రజలందరికీ మంచి ఆయురారోగ్యాన్ని, అష్టయిశ్వర్యాలను, సుఖశాంతులను అందించాలని, ఆ భోళాశంకరుని ఆశీర్వాదాం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని శైవ క్షేత్రాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మంచినీరు, తదితర సదుపాయాలను కల్పించాలని, ఎక్కడా ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు.తెల్లవారు జాము నుంచే ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరుతారు కనుక అధికారులు అప్రమత్తంగా ఉంటూ భక్తులుకు ఏ ఇబ్బందీ కలగకుండా స్వామి వారిని దర్శించుకునేలా చూడాలని నామ సూచించారు.

# సిరల్లో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ తగ్గించి గుండెని కాపాడే అలవాట్లు



హెల్త్ న్యూస్, 25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్): ఈ రోజుల్లో చాలా మంది కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. జీవనశైలిలో మార్పులు, అనారోగ్యకరమైన అలవాట్లు, కాలుష్యం, ఏది పడితే అది తినడం వల్ల అధిక కొలెస్ట్రాల్ బారిన పడుతున్నారు. హై కొలెస్ట్రాల్ సమస్యని డైస్లిపిడెమియా అని కూడా అంటారు. కొలెస్ట్రాల్ అనేది శరీరంలోని కొవ్వు. ఇది శరీరంలోని అనేక ముఖ్యమైన విధుల్ని నిర్వహిస్తుంది. కొలెస్ట్రాల్ ప్రధానంగా ఆహారం నుంచి ఉత్పత్తి అవుతుంది. కాలేయం కొంత కొలెస్ట్రాల్‌ను ఉత్పత్తి చేస్తుంది. కొలెస్ట్రాల్‌లో ప్రధానంగా రెండు రకాలు ఉన్నాయి. LDL (తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్), HDL (హై డెన్సిటీ లిపోప్రొటీన్). అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ మనకు చాలా మంచిది. దీనిని మంచి కొలెస్ట్రాల్ అంటారు.

తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ (LDL) మన ఆరోగ్యానికి మంచిది కాదు. దీనిని చెడు కొలెస్ట్రాల్ అంటారు. ఇది రక్త ధమనుల్లో పేరుకుపోతుంది. అంతేకాకుండా రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. ధమనుల్లో పేరుకుపోయే కొవ్వును ప్లేక్ అంటారు. దీని కారణంగా గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యపానం, వ్యాయామం చేయకపోవడం వంటి కారణాలు ఉన్నాయి. శరీరంలో మంచి కొలెస్ట్రాల్ తగ్గి.. చెడు కొవ్వు పెరిగితే దానిని హై కొలెస్ట్రాల్ అంటారు. అయితే, ఉదయాన్నే కొన్ని అలవాట్లు పాటిస్తే కొలెస్ట్రాల్ సమస్యను తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ అలవాట్లు ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.

కొలెస్ట్రాల్ వల్ల వచ్చే ప్రమాదాలు

చాలా మంది అధిక కొలెస్ట్రాల్ సమస్యను లైట్ తీసుకుంటారు. అయితే, ఇది పెద్ద సమస్యలకు దారి తీస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. అధిక కొలెస్ట్రాల్ మన రక్త ప్రవాహాన్ని ప్రభావితం చేస్తుంది. దీంతో, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. ఒక్కోసారి ఇది గుండె పోటుకు కారణమవుతుంది. అధిక కొలెస్ట్రాల్ రక్తపోటును పెంచుతుంది. అధిక రక్తపోటు ఆరోగ్యానికి మంచిది కాదు. చెడు కొలెస్ట్రాల్ మూత్రపిండాలపై కూడా ప్రభావం చూపుతుంది. అంతేకాకుండా కొలెస్ట్రాల్ పెరగడం వల్ల సిరలు కుంచించుకుపోవడం వల్ల శరీరంలో అనేక భాగాల్లో నొప్పి వస్తుంది. దీంతో.. పాదాల నొప్పులు వస్తాయి. అయితే, ఉదయాన్నే కొన్ని అలవాట్లతో ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు.

గోరువెచ్చని నీటితో నిమ్మకాయ

ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లలో తాజా నిమ్మరసం కలిపి తాగడం వల్ల శరీరం నిర్విషీకరణ ప్రక్రియను ప్రోత్సహిస్తుంది. ఈ అలవాటు మీ జీర్ణవ్యవస్థను సక్రియం చేయడమే కాకుండా కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. జర్నల్ ఆఫ్ బేసిక్ అండ్ అప్లైడ్ సైన్స్‌లోని ఒక నివేదిక ప్రకారం , నిమ్మకాయలో విటమిన్ సి ఉంటుంది. ఇది శరీరం నుంచి విషాన్ని తొలగించడంలో సాయపడుతుంది. దీంతో, కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించడంలో కూడా సాయపడుతుంది.

బ్రేక్‌ఫాస్ట్‌లో ఫైబర్

బ్రేక్‌ఫాస్ట్‌లో ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఓట్స్, క్వినోవా వంటి ఫుడ్స్‌ని అల్పాహారంలో భాగం చేసుకోవాలి. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో జరిపిన ఒక పరిశోధన ప్రకారం ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తాయి. ఓట్స్‌లో బీటా-గ్లూకాన్ అనే ప్రత్యేకమైన ఫైబర్ ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో సాయపడతాయి. ఓట్స్ తినడం వల్ల మంచి కొలెస్ట్రాల్ (HDL) పెరుగుతుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ (LDL) తగ్గుతుంది. ఓట్స్‌తో పాటు పండ్లు, గింజలు, కూరగాయలు వంటి వాటిని డైట్‌లో తీసుకోవడం అలవాటు చేసుకోండి.

వ్యాయామం

కొలెస్ట్రాల్‌ని తగ్గించుకోవడానికి ఉదయం వ్యాయామం చేయడం బెస్ట్ ఆప్షన్ నిపుణులు అంటున్నారు. చురుకైన నడక, యోగా, స్విమ్మింగ్ లేదా సైక్లింగ్ వంటి తేలికపాటి వ్యాయామం చేయడం కొలెస్ట్రాల్‌ని తగ్గించడానికి గొప్ప మార్గం. శారీరకంగా చురుగ్గా ఉండటం వల్ల శరీరంలో రక్తప్రసరణ బాగా మెరగవుతుంది. దీంతో చెడు కొలెస్ట్రాల్ తగ్గిపోతుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. అంతేకాకుండా వ్యాయామం చేసేటప్పుడు శరీరంలో ఎండార్ఫిన్ల స్థాయిలు పెరుగుతాయి. ఇది ఆనందాన్ని పెంచి.. ఒత్తిడిని తగ్గిస్తుంది. ఒత్తిడి కూడా కొలెస్ట్రాల్ పెరగడానికి ఒక కారణం.

నట్స్, గింజలు

వాల్‌నట్స్, బాదం పప్పు వంటి నట్స్‌లో పోషకాలు ఉన్నాయి. ఈ గింజల్లో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్‌లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఈ గింజలు కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించడంలో సాయపడతాయి. అలాగే, శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిల్ని పెంచుతాయి. అందుకే ఈ గింజల్ని మీ ఆహారంలో భాగం చేసుకోండి. వాల్‌నట్‌లు, బాదంపప్పులు రెండింటిలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో మంటను తగ్గిస్తాయి. రక్తపోటును కూడా నియంత్రిస్తాయి. కొలెస్ట్రాల్ తగ్గించడానికి ప్రతి ఉదయం 1 చేతి వాల్నట్ మరియు బాదంపప్పులను తినడం మంచి మార్గం.

గ్రీన్ టీ

1136 మంది వ్యక్తులపై నిర్వహించిన 14 ట్రయల్స్‌లో.. ప్రతిరోజూ గ్రీన్ టీ తాగడం వల్ల ప్రజల కొలెస్ట్రాల్ స్థాయిలు 7.20 mg/dl తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. గ్రీన్ టీలో పాలీఫెనాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరం నుంచి అదనపు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడతాయి. అంతే కాకుండా, రోజూ గ్రీన్ టీ తాగడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీని వల్ల శరీరంలోని కొవ్వు కూడా తగ్గుతుంది. గ్రీన్ టీలో కాటెచిన్స్ ఉంటాయి. ఇవి శరీరంలోని కొవ్వును కాల్చేస్తాయి. ఇక దీన్ని రోజూ ఉదయాన్నే తాగితే రోజంతా యాక్టివ్‌గా ఉంటారు.

ఒత్తిడిని తగ్గించుకోండి

ఒక నివేదిక ప్రకారం , ఒత్తిడి సమస్యలు ఉన్నవారిలో అధిక కొలెస్ట్రాల్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఒత్తిడి సమయంలో, కార్టిసాల్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. దీని కారణంగా కొలెస్ట్రాల్ పెరుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గించుకోవాలంటే మొదట ఒత్తిడి తగ్గించుకోవడానికి ప్రయత్నం చేయండి. ఇందుకోసం ధ్యానం, యోగా వంటి వాటిని అలవాటు చేసుకోండి. ఈ అలవాట్లు మీ కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయి. ఉదయం పదినిమిషాల పాటు ప్రాణాయామం చేయడం వల్ల ఒత్తిడి కంట్రోల్‌లో ఉంటుంది.

# నూడుల్స్ ను అధికంగా తింటున్నారా..?



హెల్త్ న్యూస్,25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):ఆఫీసుకు టైమ్ అవుతుందనో, స్కూల్ లేదా కాలేజీకి వెళ్లాలనో, పని ఉందని త్వరగా వెళ్లాలని చెప్పి చాలా మంది ఉదయం సరిగ్గా బ్రేక్ ఫాస్ట్ చేయడం లేదు. బ్రేక్ ఫాస్ట్ చేసేందుకు కూడా సరిగ్గా సమయం ఉండడం లేదని చాలా మంది చెబుతుంటారు. దీంతో 2 నిమిషాల్లో అయ్యే నూడుల్స్ వంటి ఆహారాలను ఉదయం చాలా మంది తింటున్నారు. ఇవే కాకుండా జంక్ ఫుడ్‌ను ఉదయమే ఎక్కువగా లాగించేస్తున్నారు. రెడీ టు ఈట్ ఫుడ్స్‌ను కూడా ఉదయం తింటున్నారు. అయితే ఇలాంటి ఆహారాలను తినడం అంత మంచిది కాదని, దీర్ఘకాలంలో ఇలాంటి ఆహారాలు మన శరీరంపై నెగెటివ్ ప్రభావాన్ని చూపుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చాలా మంది నూడుల్స్‌ను ఉదయం అధికంగా తింటుంటారు. అలాగే సాయంత్రం సమయంలోనూ బయట నూడుల్స్‌ను ఫాస్ట్ ఫుడ్ బండ్ల వద్ద లాగించేస్తుంటారు. నూడుల్స్ మన ఆరోగ్యానికి అత్యంత హానికరం అని, వీటిని తింటే పలు వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయని అంటున్నారు.

గుండె జబ్బులు వచ్చే చాన్స్..

నూడుల్స్‌లో సోడియం అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే శరీరంలో సోడియం స్థాయిలు పెరుగుతాయి. ఇది బీపీని పెంచుతుంది. దీంతో గుండె జబ్బులు లేదా హార్ట్ స్ట్రోక్స్ వచ్చే చాన్స్‌లు ఉంటాయి. సోడియం ఉండే ఆహారాలను తరచూ తినడం వల్ల శరీరంలో నీరు అధికంగా చేరుతుంది. శరీర భాగాలు వాపులకు గురవుతాయి. దీంతో ఆయా భాగాల్లో నొప్పులు కూడా వస్తాయి. నూడుల్స్‌లో ఎలాంటి పోషకాలు ఉండవు. అంతా చెత్తతో సమానం. వీటిని తినడం వల్ల శరీరంలో అనవసరంగా వ్యర్థాలు పేరుకుపోతాయి. వాటిని బయటకు పంపేందుకు శరీరం తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. పోషకాలు లేని ఆహారం తినడం వల్ల పోషకాల లోపం కూడా వస్తుంది. ఇది మరిన్ని అనారోగ్య సమస్యలను కలగజేస్తుంది.

బరువు పెరుగుతారు..

నూడుల్స్‌ను సాధారణంగా పామ్ ఆయిల్ లేదా నాసిరకమైన ఆయిల్స్‌లో ఫ్రై చేసి తయారు చేస్తారు. ఇవి అనారోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉంటాయి. ట్రాన్స్ ఫ్యాట్స్ వీటిలో అధికంగా ఉంటాయి. ఇవి గుండెకు ఎంతో హాని చేస్తాయి. నూడుల్స్‌ను తినడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ పెరిగిపోతాయి. అధికంగా బరువు పెరుగుతారు. దీంతో గుండె జబ్బులు లేదా హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు ఉంటాయి. నూడుల్స్ ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు వాటిల్లో ప్రిజర్వేటివ్స్, ఆర్టిఫిషియల్ పదార్థాలను కలుపుతారు. ఇవి మన శరీరంపై నెగెటివ్ ప్రభావాన్ని చూపిస్తాయి. తరచూ ఇవి మన శరీరంలోకి వెళ్తే ప్రమాదం సంభవిస్తుంది. క్యాన్సర్, గుండె జబ్బులు వచ్చే అవకాశాలు పెరుగుతాయి.

టైప్ 2 దయాబెటిస్ వచ్చే చాన్స్..

అధ్యయనాలు చెబుతున్న ప్రకారం నూడుల్స్‌ను తరచూ తినడం వల్ల మెటబాలిక్ సింగ్రోమ్ అనే వ్యాధి వస్తుంది. దీని వల్ల బీపీ పెరుగుతుంది. షుగర్ లెవల్స్ నియంత్రణ తప్పుతాయి. శరీరంలో కొవ్వు అధికంగా చేరుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా పెరుగుతాయి. నూడుల్స్ గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా పెరుగుతాయి. దీర్ఘకాలంలో ఇది టైప్ 2 దయాబెటిస్‌కు దారి తీస్తుంది. షుగర్ వచ్చేందుకు కారణం అవుతుంది. నూడుల్స్‌లో ఫైబర్ ఉండదు. అందువల్ల వీటిని తింటే జీర్ణ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా మలబద్దకం ఏర్పడుతుంది. అలాగే విరేచనం సాఫీగా అవక పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుంది. నూడుల్స్‌ను తినడం వల్ల ఇలా అనేక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. కనుక వీటిని తినడం అంత మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్‌గా ఫోర్ టైమ్ వరల్డ్‌కప్ విన్నర్

స్పోర్ట్స్ న్యూస్,25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త అసిస్టెంట్ కోచ్‌ను నియమించుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన 51 ఏళ్ల మధ్యూ మాట్ డీసీ కొత్త అసిస్టెంట్ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఆస్ట్రేలియా మాజీ ఫస్ట్ క్లాస్ క్రికెటరైన మాట్.. వివిధ జాతీయ జట్ల హెడ్ కోచ్‌గా పలు వరల్డ్‌కప్‌లు గెలిచాడు.



2022 టీ20 వరల్డ్‌కప్ గెలిచిన ఇంగ్లండ్ పురుషుల జట్టుకు మాట్ హెడ్ కోచ్‌గా వ్యవహరించాడు. ఆస్ట్రేలియా మహిళల జట్టు హెడ్ కోచ్‌గా మాట్‌కు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. మాట్ 2015-2022 మధ్యలో ఆసీస్ మహిళా టీమ్‌కు చిరస్మరణీయ విజయాలు అందించాడు. ఈ మధ్యకాలంలో ఆసీస్ ఓసారి వన్డే వరల్డ్‌కప్.. రెండు సార్లు టీ20 వరల్డ్‌కప్ గెలిచింది. దీని తర్వాత మాట్ ఇంగ్లండ్ పురుషుల జట్టు వైట్‌బాల్ హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు.

మాట్ ఇంగ్లండ్‌ను 2022 టీ20 వరల్డ్‌కప్ గెలిపించినప్పటికీ.. అతని హయాంలో ఇంగ్లండ్ 2023 వన్డే వరల్డ్‌కప్, 2024 టీ20 వరల్డ్‌కప్‌ను నిలబెట్టుకోలేకపోయింది. ఫలితంగా మాట్ తన పదవీకాలం మధ్యలోనే ఇంగ్లండ్ హెడ్ కోచ్ పదవికి రాజీనామా చేశాడు. ఇంగ్లండ్ హెడ్ కోచ్ పదవి నుంచి వైదొలిగిన అనంతరం మాట్ సిడ్నీ సిక్సర్స్ అసిస్టెంట్ కోచ్‌గా మూడేళ్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు.

తదుపరి ఐపీఎల్ సీజన్‌లో మాట్ ఢిల్లీ క్యాపిటల్స్ నూతన హెడ్ కోచ్ హేమంగ్ బదానీతో కలిసి పని చేస్తాడు. డీసీ యాజమాన్యం బౌలింగ్ కోచ్‌గా వరల్డ్‌కప్ విన్నర్, భారత మాజీ పేసర్ అయిన మునాఫ్ పటేల్‌ను ఇటీవలే నియమించుకున్న విషయం తెలిసిందే. భారత మాజీ క్రికెటర్ వేణుగోపాల్ రావు డీసీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా వ్యవహరిస్తాడు.

కాగా, ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ ప్రారంభం నుంచి వేర్వేరు పేర్లతో లీగ్‌లో ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేకపోయింది. తొలి రెండు సీజన్లలో సెమీస్‌కు చేరిన ఈ జట్టు.. 2020 సీజన్‌లో అత్యుత్తమంగా ఫైనల్స్‌కు చేరింది. ఆ సీజన్ ఫైనల్లో డీసీ ముంబై చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. గత మూడు సీజన్లలో ఢిల్లీ పేలవ ప్రదర్శన కనబర్చింది. మూడు సీజన్లలో లీగ్ దశలోనే నిష్క్రమించింది.

తదుపరి సీజన్ కోసం ఢిల్లీ జట్టు మొత్తాన్ని ప్రక్షాళన చేసింది. పాత ఆటగాళ్లను దాదాపుగా వదిలించుకుని కొత్త ఆటగాళ్లను తీసుకుంది. మెగా వేలానికి ముందు అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, ట్రిస్టన్ స్ట?బ్స్, అభిషేక్ పోరెల్‌ను రీటైన్ చేసుకుంది. కెప్టెన్ రిషబ్ పంత్ సహా ఆసీస్ స్టార్ ఆటగాళ్లు డేవిడ్ వార్నర్, మిచెల్ మార్ష్‌లను వదిలేసింది.

మెగా వేలంలో కేఎల్ రాహుల్, మిచెల్ స్టార్క్, హ్యారీ బ్రూక్, జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, టి నటరాజన్, డుప్లెసిస్ లాంటి స్టార్ ఆటగాళ్లను కొనుగోలు చేసింది. వేలంలో డీసీ యాజమాన్యం అత్యధికంగా 14 కోట్లు వెచ్చించి కేఎల్ రాహుల్‌ను సొంతం చేసుకుంది. తదుపరి సీజన్ కోసం డీసీ మేనేజ్‌మెంట్ తమ కెప్టెన్‌ను ఇంకా ప్రకటించలేదు.

## ధోనీ లాంటి వ్యక్తి కూడా పాక్ జట్టుతో ఏమీ చేయలేడు: సనా మీర్

స్పోర్ట్స్ న్యూస్,25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు పేలవ ప్రదర్శన ఇచ్చింది. దీంతో సొంత ఆటగాళ్లపై మాజీ క్రికెటర్లు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాజాగా పాక్ ఆటతీరుపై మాజీ మహిళా కెప్టెన్ సనా మీర్ స్పందించారు. ఆటగాళ్ల ఎంపిక సరిగా లేదని వ్యాఖ్యానించారు.



“ప్రస్తుతం 15 మంది ఆటగాళ్లున్న పాక్ జట్టుకు.. ఎమ్ఎస్ ధోనీ లేదా యూనిస్ ఖాన్ లాంటి వ్యక్తులను కెప్టెన్‌గా నియమించినా ఈ జట్టుతో ఏమీ చేయలేరు. నేను మ్యాచ్ చూస్తుండగా నా స్నేహితుడి నుంచి ఒక మెసేజ్ వచ్చింది. భారత్ స్కోర్ 100/2.. ఇక మ్యాచ్ చేజారినట్టే అని రాసుంది. జట్టును ప్రకటించినప్పుడే నాకు తెలుసు ఈ మ్యాచ్ మన చేజారిపోయిందని బదులిచ్చా” అని సనా మీర్ తెలిపారు.“నియమాలకు అనుకూలంగా జట్టు ఎంపిక జరగలేదు. 15 మందితో కూడిన ఆ జట్టును ప్రకటించినప్పుడే టోర్నీలో సగం మ్యాచ్‌లు ఓడినట్టే అని అనుకున్నా. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో జరిగిన గత రెండు సిరీస్‌లలో ఆడిన కీలక ఆటగాళ్లను సెలక్షన్ కమిటీ తొలగించింది” అని ఆమె విమర్శించారు.

# టీమిండియా స్టార్లపై ‘చీఫ్ సెలక్టర్’ ఆగ్రహం!

### అగార్కర్‌కు విన్నపం

స్పోర్ట్స్ న్యూస్,25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):టీమిండియా స్టార్ క్రికెటర్ల తీరుపై ముంబై క్రికెట్ అసోసియేషన్ చీఫ్ సెలక్టర్ సంజయ్ పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. మొక్కుబడిగా రంజీల్లో ఆడటం వల్ల ముంబై జట్టుకు తీరని అన్యాయం జరిగిందన్నాడు. ‘స్టార్ల’ కోసం ఉత్తమంగా రాణిస్తున్న వర్ధమాన క్రికెటర్లను పక్కనపెట్టడం వల్ల భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చిందన్నాడు.



దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందే

కాగా జాతీయ జట్టు తరఫున విధుల్లో లేనప్పుడు సెంట్రల్ కాంట్రాక్టు ఆటగాళ్లంతా దేశవాళీ క్రికెట్ ఆడాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) నిబంధన విధించిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలను అతిక్రమించిన ఇషాన్ కిషన్ , శ్రేయస్ అయ్యర్‌లను వార్షిక కాంట్రాక్టు జాబితా నుంచి తప్పించి వేటు వేసింది. తద్వారా ఆటగాళ్లంతా డొమెస్టిక్ క్రికెట్ బరిలో దిగాలనే కచ్చితమైన సంకేతాలు ఇచ్చింది.

కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు

ఈ నేపథ్యంలో టెస్టుల్లో ఫామ్‌లేమితో సతమతమైన కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు రికార్డుల రారాజు విరాట్ కోహ్లి కూడా రంజీ బరిలో దిగారు. ఇక రోహిత్‌తో పాటు అతడి ఓపెనింగ్ జోడీ యశస్వి జైస్వాల్, టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, శార్దూల్ ఠాకూర్, శివం దూబే తదితరులు ముంబై తరఫున మ్యాచ్‌లు ఆడారు.

అయితే, రోహిత్‌తో పాటు జైస్వాల్ తాము ఆడిన ఒకే ఒక్క మ్యాచ్‌లో విఫలమయ్యారు. ఇదిలా ఉంటే.. ఈ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ముంబై.. ఈసారి సెమీస్‌లోనే ఇంటిబాట పట్టింది. ఈ నేపథ్యంలో చీఫ్ సెలక్టర్ సంజయ్ పాటిల్ తమ జట్టు వైఫల్యానికి టీమిండియా ఆటగాళ్లే పరోక్ష కారణమనేలా వ్యాఖ్యలు చేశాడు.

అగార్కర్‌కు విన్నపం

“ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ఆటగాళ్లకు అంతర్జాతీయ క్రికెటర్ల వల్ల అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. అంతేకాదు.. ఆసక్తిలేకుండా దేశీ జట్టు తరఫున బరిలోకి దిగి వారు బాగా ఆడకపోతే నష్టం మనకే వస్తుంది. కాబట్టి అసోసియేషన్ ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

బీసీసీఐ ఆదేశాల వల్ల మనం వారికి జట్టులో చోటు ఇస్తున్నామన్న మాట వాస్తవం. టీమిండియా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, సెలక్షన్ కమిటీ మొత్తానికి నాదొక విన్నపం. కేవలం మీరు చెప్పారన్న కారణంగానే ఇంటర్నేషనల్ స్టార్లు దేశీ మ్యాచ్‌లు ఆడుతున్నారు.

బోర్డు కఠినంగా వ్యవహరిస్తుందనే ఉద్దేశంతో తమను తాము కాపాడుకునేందుకు మాత్రమే ఇలా చేస్తున్నారు. కానీ ఇకపై దేశవాళీ మ్యాచ్‌లలో కూడా వారి ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుంటామని మీరు హెచ్చరించండి.

టీమిండియాకు ఎంపిక చేసే సమయంలో ఈ ప్రదర్శనను పరిశీలిస్తామని చెప్పండి. అలా కాకుండా కేవలం ఆడి రండి అని చెబితే మాత్రం దేశీ జట్ల మీద ప్రతికూల ప్రభావం పడుతుంది” అని స్పోర్ట్‌స్టార్‌తో సంజయ్ పాటిల్ వ్యాఖ్యానించాడు.

## ఛాంపియన్స్ ట్రోఫీ.. బంతి పడకుండానే SA vs AUS మ్యాచ్ రద్దు

స్పోర్ట్స్ న్యూస్,25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దక్షిణాఫ్రికా - ఆస్ట్రేలియా మధ్య జరగాల్సిన గ్రూప్ బి మ్యాచ్ రద్దయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా టాస్ పడకుండానే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ ఇచ్చారు. తొలుత వర్షం తగ్గుముఖం పట్టేలా కనిపించడంతో 20 ఓవర్ల చొప్పున ఆడించే అవకాశం ఉందని వార్తలొచ్చాయి. కానీ ఆఖరికి మ్యాచ్‌ను రద్దు చేశారు.



గ్రూప్ బి పాయింట్ల పట్టిక చూస్తే.. చెరో మూడు పాయింట్లతో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. నెట్ రన్‌రేట్ బాగుండటంతో సఫారీలు తొలి స్థానంలో ఉన్నారు. ఇంగ్లాండ్, అఫ్గానిస్థాన్ పాయింట్ల ఖాతా తెరవాల్సి ఉంది. మరోవైపు ఈ రద్దు కారణంగా ఈ గ్రూపులో ఉన్న నాలుగు జట్లకు ఇంకా సెమీ ఫైనల్స్ అవకాశాలు ఉన్నాయి.

మన క్రాంతి KR TV
బుధవారం 26 ఫిబ్రవరి 2025

# సినిమా న్యూస్

epaper.krtvnews.com


## ఆయన్ని బాగా మిస్ అవుతున్నా !



అతి తక్కువ సమయంలో టాలీవుడ్ అగ్ర కథానాయికగా ఎదిగారు రకుల్ ప్రీత్ సింగ్ , స్టార్ హీరోలు అందరితోనూ ఆమె యాక్ట్ చేసింది. జాకీ భగ్నానీతో పెళ్లి తర్వాత పూర్తిగా ముంబై మకాం మార్చేసింది. గతేడాది ఫిబ్రవరి 21న జాకీతో ఆమె పెళ్లి జరిగింది. ప్రేమ వివాహంతో ఒకటైన ఈ జంట ఇటీవలే తమ మొదటి వివాహ వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకున్నారు. అయితే షూటింగ్ సమయంలో తన భర్తను చాలా మిస్ అవుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు.

'సినిమా షూటింగ్ సమయంలో మా ఆయనను బాగా మిస్ అవుతున్నట్టు అనిపిస్తుంటుంది. అయన పక్కన లేకపోతే చాలా కష్టంగా ఉంది. ఆ సమయంలో అతనికి దూరంగా ఉన్నాను అనే ఫీల్‌ను పోగొట్టుకోవడానికి ఆయన స్వెట్ షర్ట్స్‌ను ధరిస్తున్నాను" అంటూ చెప్పుకొచ్చింది. ఓ సెల్ఫీ ఫొటోను పంచుకుంది రకుల్. అందులో ఆమె 'జేబీ' అనే పేరుతో భర్త పేరును సూచించే హుడి ధరించి ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఇటీవల మేరే హస్బెండ్ కే బీవీ' సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకుల ముందుకొచ్చింది రకుల్. తదుపరి ఆమె చేతిలో ఇండియన్ 3, దేదే ప్యార్ దే 2 చిత్రాలున్నాయి. తెలుగులో అయితే ఆమె సైన్ చేసిన సినిమా ఒకటీ లేదు.

## శివ శివ శంకరా' మార్మోగిపోతోంది



మూవీ న్యూస్,25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):మంచు విష్ణు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ విరామ సమయంలో వారు స్వామివారిని దర్శించుకొని హుండీలో కానుకలు సమర్పించారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'కన్నప్ప' చిత్రం మంచి విజయం సాధించాలని స్వామివారిని వేడుకున్నట్లు విష్ణు తెలిపారు.

ఈ సినిమా నుంచి వచ్చిన 'శివా శివా శంకరా' అనే పాట సోషల్ మీడియాలో చార్ట్ బస్టర్‌గా నిలిచింది. ఈ శివరాత్రికి అన్ని చోట్లా ఈ పాటే మార్మోగిపోయేలా ఉందాని చిత్ర బృందం చెబుతోంది. ఇప్పటికే ఈ పాటను 80 మిలియన్ల (8 కోట్ల) మంది వీక్షించారు. రెండు లక్షలకు పైగా రీల్స్ చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ పాట మరింతగా ట్రెండ్ అవుతోంది.

## నటులంతా కోరుకునేది ఇలాంటి సిరీసే..



మూవీ న్యూస్,25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):వైవిధ్యభరితమైన పాత్రలతో హీరోకు ధీటుగా కనిపిస్తుంటారు నటుడు బాబీడియోల్ . ప్రస్తుతం ఆయన ఆశ్రమం సీజన్ 3 పార్ట్2లో నటిస్తున్నారు. ఇందులో బాబీడియోల్ నిరాలా బాబాగా కనిపించనున్నారు. తాజాగా ఈ సిరీస్‌లో తన పాత్ర గురించి బాబీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటి పాత్ర కోసం ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

"నేనెప్పుడూ సవాళ్లతో కూడిన పాత్రలనే ఇష్టపడతాను. అప్పుడే గుర్తింపు వస్తుంది. ఈ సిరీస్ కోసం దర్శకుడు నన్ను సంప్రదించగానే పోలీసు అధికారి పాత్ర ఇస్తారని భావించాను. కానీ బాబా పాత్ర కోసం అని తెలిసి ఆశ్చర్యపోయాను. ఆయన చెప్పింది తప్పుగా విన్నాననుకున్నా. బాబా పాత్ర నేను పోషించగలనని ఆయనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఇలాంటి పాత్ర లభించాలంటే అదృష్టం ఉండాలి. ఇది అద్భుతమైన ప్రయాణం. నటులంతా ఇలాంటి పాత్రలు రావాలని కోరుకుంటారు" అని అన్నారు.

## విజయ్ దేవరకొండ రికార్డును బీట్ చేసిన నాని



ఒక్క టీజర్‌తో ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చారు హీరో నాని . అతడి పుట్టినరోజు సందర్భంగా 'హిట్: ది థర్డ్ కేస్' టీజర్‌తో అటు ఫ్యాన్స్‌ను ఇటు సోషల్ మీడియాను షేక్ చేశారు. దీంతో సినిమాపై విపరీతమైన హైప్ క్రియేట్ అయింది. తాజాగా విడుదలైన ఈ టీజర్ 24 గంటల్లోనే మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకొని రికార్డులను సొంతం చేసుకుంటోంది. ఇటీవల విడుదలైన విజయ్ దేవరకొండ 'కింగ్ డమ్' టీజర్ యూట్యూబ్ వ్యూస్‌ను 'హిట్ 3' అలవోకగా బీట్ చేసింది.

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కింగ్‌డమ్ '. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమా టీజర్ ఇటీవల రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ చెప్పిన మాటలతో ప్రారంభమైన ఈ టీజర్ సినిమాపై అంచనాలు కలిగించింది. ఇప్పటివరకు దీనికి 15 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. నాని హీరోగా రూపొందుతున్న 'హిట్ 3' టీజర్ తాజాగా విడుదలై యూట్యూబ్‌లో ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. కేవలం 24 గంటల్లోనే 16 మిలియన్లకు పైగా వ్యూస్ సొంతం చేసుకుంది. దీంతో విజయ్ దేవరకొండ రికార్డును నాని బీట్ చేశారంటూ అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు.

## ఎవర్నయినా మర్చిపోయుంటే సారీ..



మూవీ న్యూస్,25 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్): సమంతను శక్తిమంతమైన మహిళగా అభివర్ణిస్తుంటారు చాలామంది. చెదరని చిరునవ్వు, ఆత్మవిశ్వాసం, ముక్కుసూటి తనం ఇవన్నీ ఆమెకు ఆభరణాలు. తెలుగుతెరపై తిరుగులేని స్టార్‌గా వెలిగిన సమంత.. ప్రస్తుతం టాలీవుడ్‌కి దూరంగా ఉంటూవుంది. అయితే.. ఇన్‌స్టాకు మాత్రం దగ్గరగానే ఉంటుంది. దాని ద్వారానే అభిమానులతో ఇంటరాక్ట్ అవుతూ ఉంటుంది. రీసెంట్‌గా అభిమానులతో ఇన్‌స్టా ద్వారా కబుర్లు చెప్పింది సామ్. 'నెగెటివిటీని ఎలా అధిగమిస్తారు?' అని ఓ అభిమాని అడగ్గా.. 'రెగ్యులర్‌గా మెడిటేషన్ చెయ్.. నెగెటివిటీ ఆమడ దూరంలో ఉంటుంది.' అని సమాధానమిచ్చింది సామ్.

'ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం బెస్ట్ హీరోయిన్ ఎవరు?' అని మరో అభిమాని అడగ్గా.. 'పార్వతీ తిరువోతు(ఉల్లోళుక్కు), సాయిపల్లవి(అమరన్), నజ్రియా(సూక్ష్మదర్శిని), అలియాభట్(జిగ్రా), అనన్య పాండే(సీటీఆర్ఎల్), దివ్యప్రభ (ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్), వీరంతా నా రాక్‌స్టార్స్. ఇంకెవర్నయినా మర్చిపోయుంటే సారీ..' అంటూ అందంగా నవ్వేసింది. 'తిరిగి వచ్చేయండి.. మిమ్మల్నెవరూ ఆపలేరు..' అని ఇంకో అభిమాని అనగా, 'తప్పకుండా మళ్లీ తిరిగొస్తున్న బ్రో..' అంటూ తనదైన స్టైల్‌లో పెద్దపెద్దగా నవ్వేసింది సమంత.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com